www.prajanaava.in
Telugu Daily
ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
☎ : 99484 33277 / 9014966169

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**
హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 187 | బుధవారం | 1 జూలై, 2026

పదవి శాశ్వతం కాదు

ఎన్టీఆర్, ఇందిర లాంటి వారే ఓడిపోయారు.. ఇచ్చిన హామీ మేరకు మంచి పనులు చేయడమే లక్ష్యం

- రాష్ట్రాన్ని అప్పుల బారి నుంచి గాడిన పెడుతున్నాం
- రుణమాఫీ, రైతు భరోసాతో రైతులను ఆదుకుంటున్నాం
- బకాసురుడు కేసీఆర్ చేసిన అప్పులు తీర్చలేక చస్తున్నాం
- రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే ఛాన్సే లేదు
- శిల్పకళా వేదిక సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజానావ, హైదరాబాద్: పదవులు శాశ్వతం కావని, ప్రజలకు ఇచ్చిన మాటే శాశ్వతమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఒకప్పుడు ఇందిరా గాంధీ, ఎన్టీఆర్ వంటి మహానాయకులే ఎన్నికల్లో ఓడిపోయారని గుర్తుచేశారు. తాను కూడా పదవి శాశ్వతమని ఎప్పుడూ భావించడం లేదని, ఉన్నంతకాలం ప్రజలకు మంచి చేస్తూ మంచి పేరు సంపాదించుకోవడమే తన లక్ష్యమని చెప్పారు. తాను అబద్ధాలు చెప్పనని, చెప్పిన మాట తప్పకుండా నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో నిర్వహించిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్, బీజేపీలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈ ప్రభుత్వం ప్రజలది, రైతులది, మహిళలదని పేర్కొంటూ గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను తాను ఎప్పటికీ పునరావృతం చేయనని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశిస్తూ ప్రజలే ఆయనను ఫామ్‌హౌస్‌కే పరిమితం చేశారని, ఇక రాష్ట్ర రాజకీయాల్లో ఆయనకు స్థానం లేదని వ్యాఖ్యానించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయం, ఉద్యానవన రంగాలను నిర్లక్ష్యం చేసి రాష్ట్రంలో డ్రింకింగ్ కల్చర్‌ను పెంచారని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడినప్పుడు రాష్ట్రంపై రూ.69 వేల కోట్ల అప్పు మాత్రమే ఉండగా, బీఆర్ఎస్ పాలన

తరువాయి 2లో..

మాతో పెట్టుకుంటే పుట్టగతులుండవు

- ముషీరాబాద్ ఎమ్మెల్యేకు టీఆర్ఎస్ చీఫ్ కవిత హెచ్చరిక
- జెండా పండుగ పోస్టర్లు చింపడంపై ఆగ్రహం
- జీహెచ్ఎంసీ, అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని స్పష్టం

2

రూ.30వేల కోట్ల రైతుభరోసా ఎగవేత

- సభల పేరుతో నాటకాలు తప్ప రైతులకు చేసిందేమీ లేదు
- సీఎం రేవంత్‌పై ఎక్స్ వేదికగా కేటీఆర్ విమర్శలు

2

రైతు వంచన సభ

- రూ.29,300 కోట్ల రైతు భరోసా బకాయిలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాల్సిందే
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

2

44.28 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,482 కోట్లు జమ

శిల్పకళా వేదికలో రైతు భరోసా తొలి విడత నిధుల విడుదల

2

- గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది
- రైతుల పెట్టుబడి భారం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద తొలి విడత నిధులను విడుదల చేసింది. రెండెకరాల లోపు భూమి కలిగిన 44.28 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2,482 కోట్లను నేరుగా జమ చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సీఎం నిధులను విడుదల చేశారు.

20నుంచి పార్లమెంట్

వర్షాకాల సమావేశాలు?

మూడు వారాల పాటు నిర్వహించే అవకాశం

- తుది నిర్ణయం తీసుకోని పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ
- టీఎంసీ, శివసేన (యూబీటీ) ఎంపీల గుర్తింపు అంశంపై స్పీకర్ నిర్ణయం కోసం ఎదురుచూపు

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20 నుంచి ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సుమారు మూడు వారాల పాటు సమావేశాలు నిర్వహించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. అయితే సమావేశాల తేదీలపై పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీపీఏ) ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. సాధారణంగా పార్లమెంట్ వర్షాకాల, శీతాకాల సమావేశాలు నాలుగు వారాల పాటు కొనసాగుతూ సుమారు 20 సమావేశాలు నిర్వహిస్తారు. అయితే గతంలో అవసరాన్ని బట్టి మూడు వారాల పాటు మాత్రమే సమావేశాలు నిర్వహించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈసారి కూడా అలాంటి విధానాన్నే అనుసరించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉంటే ఇటీవల జరిగిన ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్, అసోం, పుదుచ్చేరిలో అధికార బీజేపీ విజయాలు సాధించిన నేపథ్యంలో ఈ సమావేశాలు జరగనున్నాయి. అదే సమయంలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (యూబీటీ)లో చోటు చేసుకున్న అంతర్గత విభేదాలు

తరువాయి 2లో..

నూతన ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

- దేశ 31వ చీఫ్‌గా బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: భారత సైన్యానికి నూతన చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ (సీఓఏఎస్)గా జనరల్ ధీరజ్ సేథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దేశ 31వ ఆర్మీ చీఫ్‌గా ఆయన జనరల్ ఉపేంద్ర ద్వివేది నుంచి కమాండ్‌ను స్వీకరించారు. న్యూఢిల్లీలోని సౌత్ బ్లాక్‌లో సైనిక సంప్రదాయాల నడుమ నిర్వహించిన కార్యక్రమంలో అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఆర్మోర్డ్ కార్ప్స్‌కు చెందిన ఏడో అధికారిగా ఆర్మీ చీఫ్ పదవిని అధిష్ఠించడం ద్వారా జనరల్ ధీరజ్ సేథ్ ప్రత్యేక గుర్తింపు పొందారు. 1986లో ఆర్మోర్డ్ కార్ప్స్‌లో కమిషన్డ్ అధికారిగా తన సైనిక ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, దాదాపు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ సేవా అనుభవాన్ని కలిగి ఉన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల్లో కీలక బాధ్యతలు నిర్వహించిన జనరల్ సేథ్, సైన్యంలో అత్యంత ప్రాధాన్యమైన సదరన్ కమాండ్, సౌత్ వెస్ట్రన్ కమాండ్‌లకు ఆర్మీ కమాండర్‌గా సేవలందించారు. రక్షణ రంగంలో సామర్థ్యాభివృద్ధి, ఈ–లెర్నింగ్ వ్యవస్థల విస్తరణ, సైన్య ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారిగా ఆయనకు గుర్తింపు ఉంది. విస్తృతమైన కార్యాచరణ అనుభవం, వ్యూహాత్మక నాయకత్వం, ఆధునిక యుద్ధ సన్నద్ధతపై అవగాహనతో సైన్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ధీరజ్ సేథ్ నాయకత్వం కీలకంగా ఉండనుందని రక్షణ వర్గాలు భావిస్తున్నాయి.

ప్రపంచ ఏరోస్పేస్ హబ్‌గా తెలంగాణ

హైదరాబాద్ నుంచే విమానయాన రంగానికి కొత్త దిశ

- కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు గ్రీన్‌సిగ్నల్.. త్వరలో వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల పనులు
- 'మేడ్ ఇన్ తెలంగాణ' ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు
- ఏరోమార్ట్ హైదరాబాద్–2026లో మంత్రి ఉత్తమ్

ప్రజానావ, హైదరాబాద్: ప్రపంచ ఏరోస్పేస్, రక్షణ రంగాలకు తెలంగాణ కొత్త కేంద్రంగా అవతరిస్తోందని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. అత్యాధునిక విమానాలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, రక్షణ వ్యవస్థల తయారీలో హైదరాబాద్ ప్రపంచ పటంలో కీలక స్థానాన్ని సంపాదిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో విమానయాన రంగ విస్తరణ కు ప్రభుత్వం చారిత్రక నిర్ణయాలు తీసుకుంటోందని వెల్లడించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఏరోమార్ట్ హైదరాబాద్–2026 అంతర్జాతీయ ఏరోస్పేస్, డిఫెన్స్ బిజినెస్ కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమ దృష్టి ఇప్పుడు తెలంగాణపై కేంద్రీకృతమైందని, పెట్టుబడులు, సాంకేతికత, అత్యాధునిక తయారీ రంగాలకు రాష్ట్రం కొత్త చిరునామాగా మారుతోందని తెలిపారు.భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా పనిచేసిన అనుభవాన్ని ప్రస్తావించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఏరోస్పేస్ రంగంలో

తరువాయి 2లో..

రవాణాకు అంతరాయం ఉండొద్దు

- హార్మూజ్ భద్రత.. ప్రపంచ వాణిజ్యానికి కీలకం
- ఇరాన్ అధ్యక్షుడితో ఫోన్‌లో ప్రధాని మోదీ

6

రామగుండం సౌర విద్యుత్ ప్రాజెక్టు పూర్తి

- 176 మెగావాట్ల సామర్థ్యంతో ఉత్పత్తిలోకి తెచ్చిన ఎన్టీపీసీ
- చివరి విడత 41.6 మె.గా. యూనిట్‌కు కమర్షియల్ ఆపరేషన్ ప్రారంభం.. 90,899 మెగావాట్లకు పెరిగిన సామర్థ్యం

న్యూఢిల్లీ/హైదరాబాద్: రామగుండంలో ఎన్టీపీసీ నిర్మించిన 176 మెగావాట్ల సౌర విద్యుత్ (సోలార్ పీవీ) ప్రాజెక్టు పూర్తిస్థాయిలో వాణిజ్య ఉత్పత్తిలోకి వచ్చింది. ప్రాజెక్టులో చివరి దశకు చెందిన 41.6 మెగావాట్ల సామర్థ్యాన్ని మంగళవారం నుంచి కమర్షియల్ ఆపరేషన్‌లోకి తీసుకువచ్చినట్లు ప్రభుత్వ రంగ విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్టీపీసీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన నివేదికలో వెల్లడించింది. ఇప్పటికే ఈ ప్రాజెక్టులోని తొలి రెండు దశలను ప్రారంభించిన ఎన్టీపీసీ, తాజాగా మిగిలిన 41.6 మెగావాట్ల సామర్థ్యాన్ని కూడా వాణిజ్యపరంగా అందుబాటులోకి తీసుకురావడంతో

తరువాయి 2లో..

30వేల కోట్ల రైతుభరోసా నిధుల ఎగవేత

- **సభల పేరుతో నాటకాలు తప్ప రైతులకు చేసిందేమీ లేదు**
- **ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు**

ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధుల విడుదల పేరుతో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోందని, అయితే గత 30 నెలల్లో రైతులకు అందాల్సిన దాదాపు రూ.30 వేల కోట్ల పెట్టుబడి సాయాన్ని నిలిపివేసిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రైతు భరోసా నిధుల విడుదల సందర్భంగా నిర్వహించిన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మంగళవారం ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. గత రెండున్నరేళ్లలో రైతు భరోసా నిధులను నాలుగుసార్లు విడుదల చేయకుండా రైతులను తీవ్రంగా నష్టపరిచారని కేటీఆర్ ఆరోపించారు. కోట్లాది రూపాయల బకాయిలు ఉంచి, ఇప్పుడు బహిరంగ సభల ద్వారా ప్రచారం చేసుకోవడం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. ఒక బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేయాల్సిన నిధుల కోసం సభలు నిర్వహించడం ప్రజాధనాన్ని వృథా చేయడమేనని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు పూర్తి స్థాయిలో ఆ సాయం అందించలేదని ఆరోపించారు. ఒకటి, రెండు ఎకరాల వరకు మాత్రమే పరిమితంగా నిధులు విడుదల చేసి చేతులు దులుపుకుంటోందని విమర్శించారు.

పూర్తిస్థాయి రుణమాఫీ ఎక్కడ?

రెండు లక్షల రూపాయల వరకు రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించినా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని కేటీఆర్ అన్నారు. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఈ సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే రైతు భరోసా సభలు నిర్వహిస్తోందని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో కూడా ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకుంటోందని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు పథకం కింద 11 విడతల్లో రూ.73 వేల కోట్లకు పైగా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. ఆ పథకం ద్వారా రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ఊతమిచ్చామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే విధానాలను రాష్ట్ర రైతాంగం ఎప్పటికీ క్షమించదని ఆయన హెచ్చరించారు.

కావాలనే తెలంగాణపై బీజేపీ కక్ష

- **బీజేపీ, బీఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి పొన్నం**

ప్రజానావ, సిద్దిపేట : తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం లేదు కాబట్టి ఉద్దేశపూర్వకంగా ఎరువుల సరఫరాలను తగ్గించి ఇబ్బందులు సృష్టిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఎరువుల సరఫరా భారతీయ జనతా పార్టీ బాధ్యత అని చెప్పుకొచ్చారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ఎరువుల సకాలంలో విడుదల చేయడంలో ఇద్దరు ఒంద్రమంత్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 17, 18 వార్డుల్లో కొనసాగుతున్న సర్ ఓటర్ సవరణ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎరువుల తయారీ, సరఫరా కేంద్రం పరిధిలోని అంశమన్నారు. ఏ రాష్ట్రంలో కూడా ఎరువులు తయారు చేసుకోరని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తయారు చేసే ఎరువులతో పాటుగా తెలంగాణలో ఉన్న ఎరువుల ఫర్టిలైజర్ ఫ్యాక్టరీని రాష్ట్రానికి అప్పగించాలని మంత్రి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎరువుల కొరత ఏర్పడితే భారతీయ జనతా పార్టీ నాయకుల ఇళ్ల ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఎరువుల కొరత విషయంలో రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఒంద్ర మంత్రులు జాగ్రత్తగా ఉండాలని, అభివృద్ధి గిట్టని బిజెపి, బిఆర్‌ఎస్ నేతలు అదేపనిగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. ఆశ ఉండడంలో తప్పులేదని, కానీ ఆ పార్టీ అత్యాశకు పోతోందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్.. ఒ తాను ముక్కలని విమర్శించారు. కాళేశ్వరం అవినీతి, థర్మల్ పవర్ ప్లాంట్ల అక్రమాలపై సీబీఐ విచారణ కోరితే.. ఒంద్రం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.

44.28 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,482 కోట్లు జమ

- **శిల్పకళా వేదికలో రైతు భరోసా తొలి విడత నిధుల విడుదల**
- **గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది**
- **రైతుల పెట్టుబడి భారం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం**
- **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద తొలి విడత నిధులను విడుదల చేసింది. రెండు ఎకరాల లోపు భూమి కలిగిన 44.28 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2,482 కోట్లను నేరుగా జమ చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సీఎం నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రైతుల పెట్టుబడి భారం తగ్గించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత 30 నెలల ప్రజాపాలనలో రైతు గౌరవంగా జీవించేలా చర్యలు తీసుకుంటున్నామని, వ్యవసాయం దండగ కాదని, పండుగగా భావించే పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాట్లాడిన సీఎం, తెలంగాణ ఏర్పడిన సమయంలో రాష్ట్ర అప్పు రూ.69 వేల కోట్లు ఉండగా, 2023 నాటికి అది రూ.8.11 లక్షల కోట్లకు చేరిందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు. ఆ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు వాయిదాల పద్ధతిలో జీతాలు చెల్లించే పరిస్థితి నెలకొందని, సర్పంచులు, కాంట్రాక్టర్లు, సంక్షేమ పథకాల బకాయిలను పెండింగ్‌లో పెట్టి రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీశారని విమర్శించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగుల వేతనాలు చెల్లిస్తోందని తెలిపారు.

రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న సీఎం, ఇప్పటివరకు రైతు భరోసా పథకం కింద రూ.36 వేల కోట్లకు పైగా రైతులకు అందించామని వెల్లడించారు. రైతుల కోసం ప్రతి నెల సుమారు రూ.6 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని, ఉచిత విద్యుత్‌కు రూ.30 వేల కోట్లు, రైతు బీమాకు రూ.4 వేల కోట్లు, ధాన్యం కొనుగోళ్లకు రూ.80 వేల కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్‌ను నిలిపివేస్తారంటూ గతంలో దుష్ప్రచారం చేశారని, కానీ రైతులకు ఉచిత విద్యుత్‌ను 2004లో ప్రారంభించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. రైతు సంక్షేమాన్ని మరింత బలోపేతం చేస్తూ వ్యవసాయ రంగాన్ని లాభదాయకంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

భారీ బహిరంగ సభను విజయవంతం చేయండి

- **ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**
- **జూలై 4న మిడ్జిల్‌లో ధ్యాప గోపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణకు సీఎం రేవంత్‌రెడ్డి రాక**

ప్రజానావ, కల్వకుర్తి : కల్వకుర్తి పట్టణంలో జూలై 2న నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం రాష్ట్ర కన్వీనర్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి ఆధ్వర్యంలో ప్రారంభమైన బస్సు యాత్ర విజయవంతంగా కొనసాగుతోందన్నారు. జూన్ 2న కల్వకుర్తి నియోజకవర్గంలోని మైసిగండి నుంచి ప్రారంభమైన ఈ యాత్ర నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని గద్వాల, అలంపూర్ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రతి గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పిస్తోందన్నారు. ఈ బస్సు యాత్ర జూలై 2న కల్వకుర్తి పట్టణానికి చేరుకోనున్న నేపథ్యంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రభుత్వ పాఠశాల మైదానంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మంత్రి జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరుకా నున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు, పేదల ఆరోగ్య భద్రత, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళల ఆర్థిక సాధికా రతకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అలాగే విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదే సందర్భంగా జూలై 4న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలో ధ్యాప గోపాల్‌రెడ్డి శతజ యంతి సందర్భంగా ఏర్పాటు చేస్తున్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా సేవకుడిగా నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేసిన ధ్యాప గోపాల్‌రెడ్డి సేవలను స్మరించుకుంటూ నిర్వహించే ఈ కార్యక్రమం ఘనంగా జరుగుతుందన్నారు. మన ప్రాంతానికి చెందిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి రహదారులు, ఆసుపత్రులు, కేఎల్ఐ కాల్వలు తదితర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తూ ముందుకు సాగుతున్నారని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, డీసీసీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, ఎస్సీ–ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు జిల్లెల్ల రాములు, బాలాజీ సింగ్, మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్లు ఏజాస్, రామరాజు, నాయకులు భూపతి రెడ్డి, వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రియంబర్స్‌మెంట్‌పై విద్యార్థులకు ఊరట

- **హైకోర్టులో విచారణ జూలై 6కు వాయిదా**

ప్రజానావ. హైదరాబాద్ : ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు వచ్చే జులై 6వ తేదీకి వాయిదా వేసింది. ఈ సులో గత విచారణ సందర్భంగా జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు అప్పటివరకు కొనసాగుతాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. గత విచారణలో విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయరాదని పేర్కొంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్–9లోని నాలుగు నిబంధనల అమలుపై తాత్కాలికంగా స్టే విధించింది. హైకోర్టు జారీ చేసిన ఈ మధ్యంతర ఉత్తర్వులు జులై 6వ తేదీ జరిగే తదుపరి విచారణ వరకు అమల్లో ఉంటాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో సంబంధిత విద్యాసంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నెలకొన్న అనిశ్చితికి తాత్కాలిక ఉపశమనం లభించినట్లైంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానానికి సంబంధించిన వివిధ అంశాలపై పిటిషనర్లు కోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలోని కొన్ని నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. జులై 6వ తేదీ జరగనున్న తదుపరి విచారణలో ప్రభుత్వం, పిటిషనర్ల వాదనలను పరిశీలించనుంది. అనంతరం హైకోర్టు మరిన్ని ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది. ఈ సు తీర్పు రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థులు, విద్యాసంస్థలపై ప్రభావం చూపే అవకాశముండటంతో ఆసక్తి నెలకొంది.

మాతో పెట్టుకుంటే పుట్టగతులుండవు

- **ముషీరాబాద్ ఎమ్మెల్యేకు టీఆర్ఎస్ చీఫ్ కవిత హెచ్చరిక**
- **జెండా పండుగ పోస్టర్లు చింపడంపై ఆగ్రహం**
- **జీహెచ్ఎంసీ, అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని స్పష్టం**

ప్రజానావ, హైదరాబాద్: ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తమ పార్టీ జెండా పండుగకు సంబంధించిన పోస్టర్లను చింపడం దాదాగిరి, గుండాగిరికి నిదర్శనమని మండిపడ్డారు. మాతో పెట్టుకుంటే పుట్టగతులుండవు. మేము తిరగబడితే మీ జెండాలు కనిపించవు అంటూ హెచ్చరించారు. హైదరాబాద్‌లోని ముషీరాబాద్ దయారా మార్కెట్ చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. ప్రజలకు మేలు చేయాలనే లక్ష్యంతో కొత్త పార్టీని స్థాపించామని, కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించడం, యువతకు స్వయం ఉపాధి కోసం రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు, రైతు సంక్షేమం, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రధాన ఎజెండాగా తీసుకున్నామని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ఆరోపించిన కవిత, వారికి 250 గజాల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూలై 2న ఉప్పల్ భగాయత్‌లో భూపోరాటం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ముషీరాబాద్‌లో పలుమార్లు ఎమ్మెల్యేలు మారినా డ్రైనేజీ, తాగునీటి వంటి సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ప్రజల అంచనాలను నెరవేర్చలేదని, తమ పార్టీకి ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో, అసెంబ్లీ ఎన్నికల్లోనూ అన్ని స్థానాల్లో టీఆర్ఎస్ పోటీ చేస్తుందని కవిత ప్రకటించారు.

ప్రపంచ ఏరోస్పేస్ హబ్‌గా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

నాణ్యత, ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యం ఉంటుందని అన్నారు. చిన్న విడిభాగంలో లోపం కూడా కీలక మిషన్‌ను ప్రభావితం చేసే అవకాశముంటుందని, అలాంటి అత్యున్నత ప్రమాణాలను తెలంగాణ పరిశ్రమలు విజయవంతంగా అందుకుంటున్నాయని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్‌కు అవసరమైన క్యాబిన్లు, అపాచీ యుద్ధ హెలికాప్టర్ల భాగాలు, ఎఫ్–16 యుద్ధ విమానాల రెక్కలు, ప్రపంచ ప్రఖ్యాత ఏరో ఇంజిన్ల విడిభాగాలు, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్) సేవలకు అవసరమైన పరికరాలు తెలంగాణలోనే తయారవుతున్నాయని మంత్రి వెల్లడించారు. దీంతో 'మేడ్ ఇన్ తెలంగాణ'కు ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయ గుర్తింపు లభిస్తోందన్నారు.

పారిశ్రామిక విశ్వసనీయతకు నిదర్శనం

స్పెయిన్, కెనడా సహా పలు దేశాలకు చెందిన అంతర్జాతీయ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర పారిశ్రామిక విశ్వసనీయతకు నిదర్శనమని చెప్పారు. ఫ్రాన్స్, ఇటలీతో పాటు 25కిపైగా దేశాలకు చెందిన కంపెనీలు ఏరోమార్ట్‌లో పాల్గొనడం తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపును మరింత పెంచిందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,500కు పైగా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు అనుబంధంగా పనిచేస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) ఉన్నాయని మంత్రి తెలిపారు. అత్యాధునిక పారిశ్రామిక పార్కులు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, ప్లగ్–అండ్–ప్లే మౌలిక సదుపాయాల కల్పనతో తెలంగాణ దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి గమ్యస్థానంగా మారిందన్నారు. డీఆర్‌డీఓ, రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ప్రైవేట్ పరిశ్రమలు ఒకేచోట ఉండటం హైదరాబాద్‌కు ప్రపంచస్థాయి పోటీ సామర్థ్యాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆధునికీకరించిన ఐటీఐల ద్వారా ఏరోస్పేస్ రంగానికి అవసరమైన నైపుణ్యంతో కూడిన మానవ వనరులను తయారు చేస్తున్నామని మంత్రి చెప్పారు. తెలంగాణ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం గత కొన్నేళ్లుగా సగటున 30 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసిందని, గత ఏడాది ఎగుమతులు 103 శాతం పెరిగి రాష్ట్రంలోని ఔషధ పరిశ్రమను సైతం అధిగమించడం పారిశ్రామిక రంగంలో కొత్త మైలురాయిగా నిలిచిందన్నారు. విమానయాన మౌలిక సదుపాయాల విస్తరణలో భాగంగా వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని, కొత్తగూడెం విమానాశ్రయానికి కూడా త్వరలోనే గ్రీన్‌సిగ్నల్ లభించనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రాన్ని ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు.

రామగుండం సౌర విద్యుత్ ప్రాజెక్టు పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

మొత్తం 176 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించింది.

దశలవారీగా ప్రారంభం

ఈ ప్రాజెక్టులో తొలి విడతకు చెందిన 100 మెగావాట్ల సామర్థ్యాన్ని మే 2, 2026 నుంచి, రెండో విడతలోని 34.4 మెగావాట్ల సామర్థ్యాన్ని మే 29, 2026 నుంచి వాణిజ్య కార్యకలాపాల్లోకి తీసుకొచ్చారు. ఇప్పుడు మూడో విడతలోని 41.6 మెగావాట్ల యూనిట్ కూడా అందుబాటులోకి రావడంతో ప్రాజెక్టు పూర్తిగా సిద్ధమైంది. ప్రాజెక్టు పూర్తి కావడంతో ఎన్టీపీసీ గ్రూప్ మొత్తం స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 90,899 మెగావాట్లకు చేరుకుంది. ఇందులో 89,819 మెగావాట్ల సామర్థ్యం ప్రస్తుతం వాణిజ్యపరంగా అందుబాటులో ఉందని సంస్థ వెల్లడించింది. ఈ ప్రాజెక్టు దేశంలో పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, తెలంగాణలో హరిత విద్యుత్ ఉత్పత్తికి మరింత ఊతమివ్వనుంది.

ఆలయ భూ కేటాయింపుల్లో పారదర్శకత

- **యాజమాన్య హక్కులు ఆలయాల ఉండాలి**
- **తిరుమల తరహా విధానం అధ్యయనం చేయండి**
- **అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం**

ప్రజానావ, హైదరాబాద్ : స్థలాలు ఎవరికి టాయించినప్పటికీ, ఆయా భూములపై పూర్తి యాజమాన్య హక్కులు మాత్రం ఆలయాల ఉండేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ సమగ్ర అభివృద్ధి, భూ టాయింపులపై ఉన్నతాధికారు లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సవూక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ భూముల పరిరక్షణ, భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన నిర్మాణాలపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. యాదగిరిగుట్టలో హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు భూమి టాయింపు విషయమై స్పందిస్తూ, సదరు ల్యాండ్‌ను ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారమే టాయించాలని సీఎం స్పష్టం చేశారు. అలాగే, ఆలయ పరిధిలో వివిధ మతాలకు స్థలాలు ఇచ్చే అంశంపై స్పష్టమైన, పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కుల సంఘాలకు స్థలాల టాయింపులపై డా నిర్దిష్ట నిబంధనలతోడిన ఒక పాలసీని సిద్ధం చేయాలని చెప్పారు. ఈ భూ టాయింపుల పక్రియలో దేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమలలో అనుసరిస్తున్న నిబంధనలు, విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశర చేశారు. యాదగిరిగుట్టపై భక్తుల వసతి కోసం నిర్మించతలపెట్టిన అతిథిగృహాల నిర్మాణంలోనూ తిరుమల మోడల్‌నే అనుసరించాలని పేర్కొన్నారు. కొండపై కాటేజీలు, గెస్ట్‌హౌస్ల నిర్మాణం చేపట్టేందుకు ఆసక్తి చూపే దాతలు, సంస్థల వివరాలతో డిన జాబితాను తక్షణమే రూపొందించాలని, వీరికి విడతలవారీగా నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. ఆలయ పరిసరాల్లో భూ సేకరణ పక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాలను ఆధ్యాత్మిక, పర్యాటక ఒంద్రంగా తీర్చిదిద్దేందుకు పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యం పద్ధతిలో ఒక ప్రత్యేక టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇక యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణ పనులు, నాణ్యతపై గతంలో నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి, దానిపై వారం రోజుల్లోగా సమగ్ర నివేదికను తనకు అందజేయాలని ముఖ్యమంత్రి అధికారులకు గడువు విధించారు

పదవి శాశ్వతం కాదు

(మొదటిపేజీ తరువాయి)

ముగిసే నాటికి అప్పులు రూ.8.11 లక్షల కోట్లకు చేరాయని విమర్శించారు. ఉద్యోగుల జీతాలు, సర్పంచుల బిల్లులు, కాంట్రాక్టర్ల బకాయిలు, మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లించకుండా రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కూడా సీఎం తీవ్ర విమర్శలు చేశారు. లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రాజెక్టు ఆశించిన ప్రయోజనం ఇవ్వలేదని, ప్రజల సొమ్మును వృథా చేశారని అన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదని, దళితులకు మూడు ఎకరాల భూమి, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటికో ఉద్యోగం వంటి హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు.

బీజేపీ రాజకీయాలు ఇక్కడ సాగవు

కేంద్ర ప్రభుత్వంపై కూడా రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, ప్రతి పేద కుటుంబ ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలు అమలు కాలేదని ప్రశ్నించారు. తెలంగాణ లో బీజేపీకి ప్రజలు అవకాశం ఇవ్వబోరని, ఇక్కడ ఆ పార్టీ రాజకీయాలు సాగవని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం రెండేళ్లలో 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాట పట్టించిందని సీఎం తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు వారినే బస్సుల యజమానులుగా చేసే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. సాగు ప్రారంభమయ్యే సమయంలోనే రైతులకు రైతు భరోసా అందిస్తున్నామని, తొమ్మిది రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్లను జమ చేస్తామని వెల్లడించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉన్నందున రైతులు వరితో పాటు మెట్ట పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. వ్యవసాయం రైతుకు భారంగా కాకుండా పండుగలా మారేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని క్రమంగా గాడిలో పెట్టి సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



20నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు?

(మొదటిపేజీ తరువాయి)

కూడా సమావేశాల్లో ప్రధాన చర్చాంశాలుగా మారే అవకాశం ఉంది.

స్పీకర్ నిర్ణయంపై ఉత్కంఠ

లోక్‌సభలో టీఎంసీకి చెందిన 20 మంది, శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు తమను ప్రత్యేక గ్రూపులుగా గుర్తించాలని చేసిన విజ్ఞప్తిపై స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం ఇంకా వెలువడలేదు. ఈ అంశంపై సమావేశాలకు ముందే స్పష్టత వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

రాజ్యసభలో ఎన్డీఏకు మరింత బలం

ఇటీవల కొత్తగా ఎన్నికైన, తిరిగి ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేయడంతో రాజ్యసభలో అధికార ఎన్‌డీఏ బలం మరింత పెరిగింది. దీంతో వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వానికి శాసన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో మరింత అనుకూల పరిస్థితులు ఏర్పడనున్నాయి.

రైతు ఆశీర్వాద సభ కాదు.. వంచన సభ

- **రూ.29,300 కోట్ల రైతు భరోసా బకాయిలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి**
- **ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాల్సిందే**
- **మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు**

ప్రజానావ, మహబూబ్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులను అడుగడుగునా మోసం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహిస్తున్నది రైతు ఆశీర్వాద సభ కాదని, అది రైతు వంచన సభేనని విమర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన సదస్సు, అనంతరం బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గతంలో చేసిన ప్రసంగాల వీడియోలను ప్రదర్శించిన హరీశ్‌రావు, సీఎం వ్యాఖ్యలు ముఖ్యమంత్రి పదవి గౌరవాన్ని తగ్గించేలా ఉన్నాయని విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ఎన్నికల హామీల కోసం ఎదురు చూడకుండా ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఎకరానికి ఏడాదికి రూ.15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు పూర్తి స్థాయిలో నిధులు ఇవ్వలేదని హరీశ్‌రావు విమర్శించారు. ఈ లెక్కన ప్రభుత్వం రైతులకు రూ.29,300 కోట్ల రైతు భరోసా బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఆ మొత్తాన్ని ఎప్పటిలోగా విడుదల చేస్తారో సీఎం స్పష్టమైన గడువు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రైతులను దోచుకుంటున్నారు

రాష్ట్రంలో ఎరువుల ధరలు పెరిగిపోయాయని, మార్కెట్లలో తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. యూరియా కొరతను నివారించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఎరువుల కొరతను కప్పిపుచ్చుకునేందుకే యాప్‌ల పేరుతో కొత్త విధానాలు తీసుకొస్తోందని విమర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావుపై కూడా హరీశ్‌రావు విమర్శలు చేశారు. జిల్లా రైతుల సమస్యలపై స్పందించకుండా ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని అన్నారు. రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతాంగం తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. తెలంగాణ రైతుల తరఫున రైతు భరోసా బకాయిల విడుదలపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

వీధి వ్యాపారులు ఆర్థికంగా ఎదగాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి
- మున్సిపల్, మెప్మా ఆధ్వర్యంలో పీఎం స్వనిధి పథకం మహోత్సవం

ప్రజానావ, సిరిసిల్ల : అర్హులైన వారు పీఎం స్వనిధి పథకం ద్వారా బ్యాంకుల నుండి రుణాన్ని పొంది వారి వ్యాపారాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి సూచించారు. మంగళవారం స్థానిక సినారే కళామందిరంలో పురపాలక సంఘం, మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన పియం స్వనిధి మహోత్సవ్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ వీధి వ్యాపారుల సంక్షేమంకై కరోనా సమయంలో పీఎం ఆత్మ నిర్భర్ నిధి పథకం ప్రారంభించడం జరిగిందని, ఈ పథకం ద్వారా వీధి వ్యాపారులను గుర్తించి వారికి మొదటి విడతగా 10 వేల రూపాయలు రుణాన్ని కూడా అందించడం జరిగిందన్నారు. ఈ రుణాన్ని సరిగ్గా తిరిగి చెల్లించిన వారికి రెండో విడతగా 20 వేల రూపాయలు, మూడో విడతగా 50 వేల రూపాయలను వీధి వ్యాపారుల వ్యాపార అభివృద్ధికై అందించడం జరిగిందన్నారు. అర్హులైన వీధి వ్యాపారులు వారి కుటుంబాల ఆర్థిక సామాజిక పురోగతిని మరింత బలోపితం చేయడంలో భాగంగా ఈసారి మొదటి, రెండో విడత లోన్ల పరిమితిని రూ.15 వేలు అలాగే రూ. 25 వేలుగా నిర్ణయించి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కనుక అర్హులైన వారు ఈ పథకం ద్వారా బ్యాంకుల నుండి రుణాన్ని పొంది వారి వ్యాపారాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. స్వయం ఉపాధిలో భాగంగా ఇలా చిరు వ్యాపారాల ద్వారా వారి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తూ స్వయం ఉపాధి పొందుతున్న ప్రతి ఒక్కరిని ఈ సందర్భంగా అభినందిస్తున్నానని అన్నారు. అనంతరం వీధి వ్యాపారస్తులకు గుర్తింపు కార్డులను, బ్యాంకు రుణ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండి ఖాదీర్ పాషా, మెప్మా ఏవో ఫసహాద్ అలీ బేగ్, మున్సిపల్ కౌన్సిలర్లు దార్ణం అరుణ లక్ష్మీనారాయణ, దూడం రజనీ శ్రీనివాస్, బొద్దుల శ్రీనివాస్, లింగంపల్లి గంగరాజు, కోఆప్షన్ సభ్యులు నంది శంకర్, కొండ అనూష శ్రీనివాస్, బ్యాంక్ అధికారులు, మెప్మా అధికారులు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

విద్యార్థినుల భద్రతకు అండగా షీ టీమ్

- మహిళలు,బాలికలు వేధింపులను సహించొద్దు
- వెంటనే షీ టీమ్‌ను ఆశ్రయించండి
- మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్

ప్రజానావ. రామగుండం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్‌లోని మంచిర్యాల సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో మంచిర్యాల షీ టీమ్ ఎస్ఐ ఉషారాణి ఆధ్వర్యంలో షీ టీమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డీసీపీ ఏ. భాస్కర్ మాట్లాడుతూ, మహిళలు, విద్యార్థినుల భద్రత, ఆత్మవిశ్వాసం, గౌరవాన్ని పరిరక్షించడమే షీ టీమ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే భయపడాల్సిన అవసరం లేదని, కేసు నమోదు చేస్తే భవిష్యత్తు దెబ్బతింటుందనే అపోహలను విడిచిపెట్టాలని సూచించారు. మహిళలు, విద్యార్థినులు తమకు ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా షీ టీమ్ దృష్టికి తీసుకురావాలని కోరారు.షీ టీమ్‌కు ఫిర్యాదు అందిన వెంటనే సభ్యులు బాధితురాలిని గోప్యంగా సంప్రదించి సమస్యను తెలుసుకుని, అవసరమైన విచారణ నిర్వహించి, తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు.ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.సామాజిక మాధ్యమాలు,ఫోన్ కాల్స్, సందేశాలు లేదా ప్రత్యక్షంగా ఎలాంటి వేధింపులు ఎదురైనా వాటిని సహించకుండా వెంటనే షీ టీమ్‌ను సంప్రదించాలని సూచించారు. పోనీలే అనే భావనతో వేధింపులను భరిస్తే అవి మరింత పెరిగే అవకాశం ఉంటుందని, అందువల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ మౌనంగా ఉండవద్దని విద్యార్థినులకు సూచించారు. విద్యాసంస్థలు, వసతి గృహాలు,నివాస ప్రాంతాలు, ఉద్యోగ ప్రదేశాలు లేదా ప్రయాణ సమయంలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైనా షీ టీమ్ సహాయం తీసుకోవాలని, మహిళల భద్రత కోసం షీ టీమ్ 24 గంటలూ పనిచేసే ప్రత్యేక పోలీసు విభాగమని తెలిపారు. ప్రతి విద్యార్థిని తన సమస్యను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా షీ టీమ్‌తో వెంటనే పంచుకోవాలని, సమస్యలను దాచిపెట్టకుండా ధైర్యంగా ముందుకు వస్తే పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని పేర్కొన్నారు.విద్యార్థులు జీవితంలో సరైన నిర్ణయాలు తీసుకోవాలంటే అవసరమైనప్పుడు ధైర్యంగానో చెప్పడం నేర్చుకోవాలని డీసీపీ సూచించారు.ప్రతి విషయానికీ ఎస్ చెప్పడం కంటే, తమకు ఇష్టం లేని, భవిష్యత్తుకు హాని కలిగించే విషయాలను ధైర్యంగా తిరస్కరించే వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలని అన్నారు.పిల్లలకు చిన్నప్పటి నుంచేనో చెప్పే ధైర్యాన్ని పెంపొందించాలని, జీవితంలో అనేక సమస్యలకు మూల కారణం ఇష్టం లేకపోయినా తిరస్కరించలేకపోవడమేనని వివరించారు. ఇతరులను చూసి చదువులు లేదా వృత్తులను ఎంచుకోవడం కంటే, తమ ఆసక్తులు, ప్రతిభ, సామర్థ్యాలను గుర్తించి వాటికి అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు.ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ ఉంటుందని,ఆ ప్రతిభను గుర్తించి అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు.భవిష్యత్తులో చదువు, ఉద్యోగం, వ్యక్తిగత జీవితంలో ఎదురయ్యే ఒత్తిడులు, ప్రలోభాల మధ్య సరైన నిర్ణయాలు తీసుకునేందుకు విశ్లేషణాత్మక ఆలోచనతో పాటు అవసరమైనప్పుడు నో చెప్పగల ధైర్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమస్యలను చూసి భయపడకుండా, ముందుగా వాటిని సరిగా అర్థం చేసుకుని,వాటి మూల కారణాన్ని గుర్తిస్తే పరిష్కారం సులభంగా దొరుకుతుందని తెలిపారు.గణిత సమస్యను పరిష్కరించినట్లే జీవితంలోని ప్రతి సమస్యను ప్రశాంతంగా విశ్లేషించి, సరైన ప్రణాళికతో ముందుకు సాగితే ఏ సవాలునైనా అధిగమించవచ్చని డీసీపీ ఏ.భాస్కర్ విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్,ఐపీఎస్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్,మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ ఉషారాణి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అనూష, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనం పెంచకుంటే ఆగస్టు 15 నుంచి సమ్మె

మధ్యాహ్న భోజన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసాల రమేష్

తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ కమిటి
పెద్దపల్లి జిల్లా
ప్రదర్శన....ర్యాలీ....
1. కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరాచేయాలి.
2. మధ్యాహ్న భోజన నిర్వాహకులను కార్మికులుగా గుర్తిం
3. కనీస వేతనం 26వేలుగా ఇవ్వాలి.

ప్రజానావ, పెద్దపల్లి : జిల్లాలోని మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్న కార్మికులు 24 సంవత్సరాలుగా శ్రమ దోపిడీకి ఆర్థిక దోపిడీకి గురవుతున్నామన్నారు. ఒక కోడిగుడ్డుకు ఆరు రూపాయలు మాత్రమే ప్రభుత్వం ఇస్తుంది కానీ మార్కెట్లో ఏడు రూపాయల నుండి ఎనిమిది రూపాయల వరకు దొరుకుతుందన్నారు. అధికారులు మాత్రం మూడు కోడిగుడ్లను కచ్చితంగా ఇవ్వాల్సిందని ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులను ప్రభుత్వాన్ని అనేకమార్లు విన్నవించుకున్నాం అన్నారు. కోడి గుడ్లను ప్రభుత్వమే అంగన్వాడి సెంటర్లకు ఇచ్చిన విధంగా సరఫరా చేయాలని 24 సంవత్సరాలుగా విన్నవించుకుంటున్నాం ఇప్పటివరకు పట్టించుకున్న అధికారి గాని ప్రభుత్వం కానీ లేదు అంగన్వాడి సెంటర్లకు ఎలాగైతే సరపర చేస్తారన్నారు. అలాగా విద్యాశాఖ అధికారి, కలెక్టర్ కానీ పట్టించుకోని టెండర్ ఇస్తే కోడిగుడ్ల సరఫరా సాధ్యం అవుతుంది అలాగే గ్యాస్ కూడా ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలి రాగి జావా సత్యసాయి ట్రస్ట్ రాగి పౌడర్లు బెల్లాన్ని అందిస్తుంది దాని విద్యార్థులకు అందించుటకు 25 పైసలు కేటాయించారు. వందమంది విద్యార్థులు ఉన్నచోట రూ.25 వస్తాయి జావా తయారు చేయుటకు గ్యాస్ కూడా రాదన్నారు. మరి కార్మికుల పరిస్థితి ఏంటి ప్రతి సంవత్సరం మధ్యాహ్న భోజన కార్మికులకు పని భారం పెంచుతున్నారు కానీ వేతనం పెంచడం మాత్రం ప్రభుత్వం మర్చిపోతుందన్నారు. కెసిఆర్ ప్రభుత్వం అల్పాహారం ప్రారంభించి జిల్లాలలో మండలానికి మూడు పాఠశాలల చొప్పున అల్పాహారాన్ని ప్రారంభించింది అల్పాహారం చేసిన చోట 2000 రూపాయలు వేతనం కూడా ఇస్తానని తెలిపింది కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అల్పాహారాన్ని ఎత్తివేసిందన్నారు. సత్యసాయి ట్రస్ట్ అక్షయ పాత్ర ఉన్న నాలుగు ఐదు జిల్లాల్లో అందిస్తున్నారన్నారు. అక్కడ సైతం మధ్యాహ్న భోజన కార్మికులే వడ్డించాల్సిన పరిస్థితి స్వచ్ఛంద సంస్థలు అందించే మధ్యాహ్న భోజనమే సక్రమంగా లేదని విద్యాశాఖ చైర్మన్ గారే ప్రభుత్వానికి తెలిపినప్పటికీ మళ్లీ అల్పాహారాన్ని కూడా ట్రస్టుల ద్వారా అందిస్తూ వారం గడపకు ముందే ప్రభుత్వం సరిగా అందించడం లేదని నిందకు గురవుతున్నారు రాష్ట్ర వ్యాప్తంగా రాగి జావా అన్నారు పాలు, అల్పాహారం అవన్నీ ఎక్కడ కెసిఆర్ ప్రభుత్వం అల్పాహారాన్ని హడావిడిగా ప్రారంభించింది. మేము దాన్ని సరిచేసి రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షల పాఠశాలకు అందిస్తామని తెలిపిన ప్రభుత్వం ఇప్పటివరకు రాష్ట్రంలో ఉన్న ఐదు శాతం పాఠశాలలకు కూడా అందియలేని దుర్భర పరిస్థితి ఎలక్షన్లకు ముందు మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించి రూ.10వేల వేతనం ఇస్తాం అట్లాగే మెస్ చార్జీలు కూడా పెంచి పిల్లలకు మంచి పౌష్టిక ఆహారం అందిస్తాం అని తెలిపిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందన్నారు. కార్మికులకు కనీస వేతనం ఇచ్చి అల్పాహారాన్ని అందియ్యాలంటే అన్ని పాఠశాలల్లో కిచెన్ షెడ్లను అల్పాహారం చేయడానికి అనుకూలంగా మధ్యాహ్న భోజన నిర్వహించడానికి అనుకూలంగా నిర్మాణం చేపట్టి వాటికి అవసరమైన ఇన్స్టుమెంట్స్ వంట పాత్రలు అలాగే కార్మికులకు కనీస వేతనం నిర్ణయించాలి అది లేకుండా గాలి మాటలు చెప్పి రాష్ట్రవ్యాప్తంగా అల్పాహారం అని పాఠశాలలు ప్రారంభం ముందే ఉపాధ్యాయులు గ్రామాలలో తెలపడం వలన ఇప్పుడు ఉపాధ్యాయులను పిల్లల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారన్నారు. అల్పాహారం ఏది రాగిజావ ఏది? పాలు ఏవి అని ప్రశ్నించారు. వారికి సమాధానం ప్రభుత్వం తెలుపాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. నిత్యవసర వస్తువులు గ్యాస్ నుండి మొదలుకొని కోడిగుడ్లు ఉప్పు పప్పు అన్ని సరుకులు కూరగాయలు కూడా ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు కుక్ కం హెల్పర్‌గా విద్యాశాఖ నుండి గుర్తింపు కార్డులు ఇచ్చి పనికి భద్రత కల్పించాలన్నారు. ప్రస్తుతం స్వచ్ఛంద సంస్థల నుండి నడుస్తున్న భోజన నిర్వహణ సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు తిపిరి శెట్టి లావణ్య, లంక విజయ, పాతకుల కళావతి, నేటి రాధమ్మ, ఎండి జుబేదా, పిడుగు గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- స్కూల్ అభివృద్ధికి రూ.లక్ష విరాళం ప్రకటించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ప్రజానావ, సిరిసిల్ల : విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, పాఠశాల పూర్వ విద్యార్థి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ లోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నూతన తరగతి గదులను ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై ప్రారంభించారు. జాతీయ స్థాయి ఆటల పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే అందించి.. అభినందించారు. అలాగే ఉద్యోగ విరమణ పొందుతున్న డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయుడిని సన్మానించి.. వారి సేవలను కొనియాడారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..పదో తరగతి లో ఈ పాఠశాల నుంచి చాలా మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని వెల్లడించారు. ప్రతి విద్యార్థి తమ నేపథ్యం ఏదైనా తాము ఒక లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. పాఠశాల పూర్వ విద్యార్థి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. పాఠశాల ఎంతో మందికి ధైర్యం ఇచ్చిందని, ఈ బడిలో సీటు రావడం చాలా కష్టంగా ఉండేదని గుర్తు చేశారు. తల్లితండ్రులకు కూడా నమ్మకం ఉందని తెలిపారు. బొప్పాపూర్ స్కూల్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చా రు. స్కూల్ అభివృద్ధికి రూ. లక్ష విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సబేరా బేగం, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ సత్తయ్య, సర్పంచ్ గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు
- పార్టీలకు అతీతంగా వేములవాడ పట్టణ అభివృద్ధి: చైర్మన్ పుల్కం రాజు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో పట్టణ ప్రగతి
- పారిశుద్ధ్యం లోపించొద్దు.. డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి
- కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజానావ, వేములవాడ: వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన 41 అజెండా అంశాలను సభ ముందు ఉంచగా, సుదీర్ఘ చర్చ అనంతరం వాటన్నింటినీ ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశం ముగిసిన అనంతరం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా వేములవాడ పట్టణ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని స్పష్టం చేశారు. స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారి ప్రత్యేక సహకారం, మార్గదర్శకత్వంలో నిధులు కేటాయించుకుంటూ వేములవాడను అన్ని రంగాల్లో ముందంజలో నిలుపుతున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున పట్టణ ప్రజలందరూ ఆరోగ్య విషయాల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరారు. వర్షాల వల్ల పట్టణంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా పట్టణంలో పారిశుద్ధ్యం లోపించకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రతి వార్డులో డ్రైనేజీలను నిరంతరం శుభ్రం చేస్తూ నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు మున్సిపల్ సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం పనిచేయాలని స్పష్టం చేశారు. అలాగే రాత్రి వేళల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా పట్టణంలోని అన్ని వీధి దీపాల సమస్యలను తక్షణమే పరిష్కరించి, ఎక్కడా చీకటి లేకుండా చూడాలని విద్యుత్ విభాగం అధికారులను ఆదేశించారు. శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ గారి అండదండలతో వేములవాడ పట్టణ ప్రగతికి, ప్రజల మౌలిక వసతుల కల్పనకు తమ కౌన్సిల్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, అధికారులు, కౌన్సిలర్లు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని చైర్మన్ పుల్కం రాజు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



3డీ యానిమేటెడ్ పోలీసు పెట్రోలింగ్ వాహన నమూనాల ఏర్పాటు

ప్రజానావ, సుల్తానాబాద్ : రోడ్డు ప్రమాదాల నివారణకు వినూత్న చర్యగా సుల్తానాబాద్ పోలీసులు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌రావు,ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో 3డీ యానిమేటెడ్ పోలీసు పెట్రోలింగ్ వాహన నమూనాలను ఏర్పాటు చేశారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాలు అధికంగా జరిగే నారాయణపూర్ క్రాస్‌రోడ్ మరియు ఎస్ఆర్ఎస్పీ కాలువ సమీపంలోని కాట్నపల్లి ప్రాంతంలో ఈ 3డీ యానిమేటెడ్ పోలీసు పెట్రోలింగ్ వాహన నమూనాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ,రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఇటువంటి 3డీ యానిమేటెడ్ నమూనాలను పలు దేశాల్లో కూడా విజయవంతంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు.అతివేగమే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొంటూ, ప్రమాదాలను నివారించడంతో పాటు అతివేగాన్ని నియంత్రించేందుకు సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ రహదారిపై ఈ తరహా 3డీ యానిమేటెడ్ పోలీసు పెట్రోలింగ్ వాహన నమూనాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాజీవ్ రహదారిపై తరచుగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో, అతివేగంగా లేదా మద్యం మత్తులో వాహనాలు నడిపే వాహనదారులు దూరం నుంచే ఈ 3డీ యానిమేటెడ్ పోలీసు పెట్రోలింగ్ వాహన నమూనాలను గమనించి వాహన వేగాన్ని తగ్గించే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రాత్రి సమయంలో కూడా ఈ నమూనాలు స్పష్టంగా కనిపించేలా రేడియం స్టిక్కర్లను అమర్చినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

- రైతులు ఆందోళన చెందవద్దు
- ఫెర్టిలైజర్ యాప్ తో 50 వేలకు పైగా రైతులు యూరియా సంచులు కొనుగోలు
- యాప్ నుంచి రైతులు బుక్ చేసుకోవాలి
- యాప్ ను అప్డేట్ చేసుకోవాలి
- రైతు వేదికలు, పీఏసీఎస్ లు, ప్రైవేట్ డీలర్ల వద్ద సహాయకులు
- జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్

ప్రజానావ, సిరిసిల్ల : జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఫెర్టిలైజర్ యాప్, ఎరువుల సరఫరా తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, వ్యవసాయ శాఖ ఇతర శాఖల అధికారులతో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలో ఫెర్టిలైజర్ యాప్ సేవలు రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. ఈ సీజన్లో 19,513 రైతులు 60,254 సంచుల యూరియా యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్నారని, తమ సమీపంలోని షాప్ ల ద్వారా 50,283 సంచులు తీసుకువెళ్లారని వెల్లడించారు. ఇంకా 9,830 సంచులు తీసుకువెళ్లాల్సి ఉందని తెలిపారు. జిల్లాలో ఇంకా 12,292 సంచులు నిలువలు ఉన్నాయని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు మేరకు జిల్లాలోని 20 రైతు వేదికలు, అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద ఎరువుల నిలువలు ఉన్నాయని స్పష్టం చేశారు. రైతులకు సహాయం చేసేందుకు అన్ని చోట్ల సిబ్బంది ఉన్నారని తెలిపారు. ఫెర్టిలైజర్ యాప్ అప్డేట్ చేసుకోవాలని, యూరియా నిలువులు దానిలో చూపించకపోతే ఆందోళనకు గురికాకుండా దానిని రిఫ్రెష్ చేయాలని సూచించారు. రైతులు ఎవరైనా యూరియా సరఫరాలో సమస్యలు ఎదుర్కొంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా, శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలని రైతులను కోరారు. కొందరు సోషల్, ఇతర మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్న అసత్య ప్రచారాలు నమ్మవద్దని సూచించారు. పంటల సాగుకు అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉంటాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు. ఈ సీజన్ కు సరిపడా ఎరువుల నిల్వలను జిల్లాలోనే సిద్ధంగా ఉంచాలని మార్క్ ఫెడ్ అధికారులను ఆదేశించారు. ఎరువులు పక్కదారి పట్టకుండా పోలీసులు వ్యవసాయ అధికారులు చూడాలని స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, మార్క్ ఫెడ్ అధికారి హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి భూ పోరాటం విజయవంతం చేయాలి

తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు సలేంద్ర కొమురయ్య

ప్రజానావ, పెద్దపల్లి : జులై 2న చేపట్టబోయే భూ పోరాటం కార్యక్రమాన్ని ఉద్యమకారులు విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన పెద్దపల్లి జిల్లా బాధ్యులు సలేంద్ర కొమురయ్య యాదవ్ పిలుపునిచ్చారు. పెద్దపల్లి మండలంలోని పెద్ద కల్వల గ్రామంలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల భూ పోరాటం చలో ఉప్పల్ బగాయత్ ఉద్యమకారులు అధిక సంఖ్యలో తరలిరావాలని కొమురయ్య యాదవ్ కోరారు. అలాగే ఉద్యమకారుల హామీలు నెరవేర్చడం కోసం తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ అయినటువంటి కవిత ఆధ్వర్యంలో ఉప్పల్ బగాయత్‌లో ఉద్యమకారుల ఉద్యమానికి 250 గజాల భూమి, ఉద్యమకారునికి రూ.25 వేల పెన్షన్, గుర్తింపు కార్డు, వివిధ సంక్షేమ పథకాలు పెట్టి విఫలమైన ప్రభుత్వాలు గత టిఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేయుటకు కల్వకుంట్ల కవిత నేతృత్వంలో ఉద్యమానికి భారీ ఎత్తున తరలి రావాలని ఉద్యమకారులు అందరిని ఈ భూ పంపిణీ పోరాటాన్ని విజయవంతం చేయాలని టిఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా బాధ్యులు సలేంద్ర కొమురయ్య యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో బొంగోని శంకరయ్య గౌడ్, మల్యాల కరుణాకర్, బొంకూరి సుభాష్, దేవనంది లక్ష్మయ్య, సిహెచ్ హనుమాన్లు, కలవల రవీందర్, గంధం శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
విలేకరులు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న తెలుగు దినపత్రిక ప్రజానావలో
పని చేయుటకు మా సంస్థ ఆహ్వానం పలుకుతోంది
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు,
నియోజకవర్గ కేంద్రాలు,
మండల కేంద్రాల్లో పనిచేయుటకు విలేకరులు కావలెను.
మండలాలు, అర్బన్, పట్టణ కేంద్రాల్లో
పనిచేసే వారికి కనీస అర్హత ఇంటర్మీడియట్
స్టాఫ్ రిపోర్టర్, ఆర్‌సీ ఇన్‌చార్జీలకు
కనీస అర్హత డిగ్రీ ఉండాలి
మీ బయోడేటాను ఇప్పుడే ఈ నెంబర్లకు వాట్సాప్ చేయండి
☎ 9948433277, 9014966169

ఎస్ఓఎం అల్లావుద్దీన్‌కు ఘన సన్మానం

- 37 ఏళ్ల సేవలకు అధికారుల ప్రశంసలు
- రామగుండం ఏరియా–1 జీఎం కార్యాలయంలో సత్కార కార్యక్రమం

ప్రజానావ, రామగుండం: జీడీకే 2, 2ఏ ఇంక్లైన్‌లో ఎస్ఓఎంగా 37 సంవత్సరాల పాటు సేవలందించి మంగళవారం పదవీ విరమణ పొందిన అల్లావుద్దీన్‌కు రామగుండం ఏరియా–1 జీఎం కార్యాలయంలో ఘన సన్మానం నిర్వహించారు. ఆర్జీ–1 జీఎం లలిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ఉన్నతాధికారులు అల్లావుద్దీన్‌కు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సంస్థకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాట్లాడిన జీఎం లలిత్ కుమార్, అల్లావుద్దీన్ క్రమశిక్షణ, అంకితభావం, స్నేహపూర్వక స్వభావంతో అందరి మన్ననలు పొందారని పేర్కొన్నారు. పదవీ విరమణ ప్రతి ఉద్యోగి జీవితంలో అనివార్యమని, ఆయన మిగిలిన జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం అల్లావుద్దీన్‌ను కుటుంబ సభ్యులు, సన్నిహితులు కూడా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం చంద్రశేఖర్, ఏజెంట్లు, మేనేజర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలపై టీఆర్ఎస్ భూ పోరాటం

ప్రజానావ, కోనరావుపేట: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత చేస్తున్న భూ పోరాటానికి మద్దతుగా అత్యధికమంది తరలి రావాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా నాయకులు నూనె మల్లేష్ యాదవ్, మంగళవారం రోజున ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులకు 250 గజాల భూమి గృహ నిర్మాణ సదుపాయం ప్రత్యేక సంక్షేమ పథకాలు కల్పిస్తామని ప్రభుత్వాలు పలుమార్లు హామీ ఇచ్చిన ఇప్పటికీ అమలు కాలేదన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యమకారుల న్యాయమైన హక్కుల సాధన కోసం తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, నాయకత్వంలో జూలై రెండున ఉప్పల్ బాగాయత్ లో భూ పోరాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మనం పౌరులమన్నదానికి గుర్తింపు ఏది?

> ఎవరైనా విదేశాలకు వెళ్లాలన్నా గుర్తింపు కార్డుగా చూపించాలన్నా అందరికీ ముందుగా గుర్తొచ్చేది పాస్పోర్టే. అయితే విదేశీ వ్యవహారాల శాఖ నుంచి వచ్చిన ఓ ప్రకటన ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పాస్‌పోర్ట్ వలం ప్రయాణ పత్రం మాత్రమేనని.. అది పౌరసత్వానికి నిదర్శనం కాదని ఇటీవల తేల్చి చెప్పింది. ఆధార్ డా వలం గుర్తింపు కార్డు మాత్రమేనని గతంలోనే తేల్చారు. భారతీయులకు పాస్‌పోర్ట్ వలం ఒక ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమేనని స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారుల పటిష్టమైన విచారణ తర్వాతే పౌరులకు దీన్ని జారీ చేస్తారు. భారత రిపబ్లిక్ పేరుతో జారీ అయ్యే ఈ పత్రం ప్రపంచవ్యాప్తంగా ఆమోదం పొందుతుంది.

ఇప్పుడు పౌరసత్వానికి గుర్తింపు ఏంటన్న చర్చ జోరుగా సాగుతోంది. పాస్పోర్టు కాదన్నారు. ఆధార్ కూడా కాదన్నారు. ఓటరు ఐడి అంతకన్న కాదన్నారు. మరి ఏది మనలను భారతీయులు అని గుర్తించడానికి అన్నది..? దీనికి సమాధానం కనిపించడం లేదు. కాదన్నవారు చెప్పడం లేదు. సర్ ప్రక్రియ సాగుతున్న వేళ దీనిపై పెద్ద దుమారమే లేచింది. పాస్‌పోర్ట్ కూడా కాదన్నప్పుడు ఏది అన్న ప్రశ్న సహజంగానే వస్తోంది. అసలు మన దేశంలో పౌరసత్వాన్ని ఎలా గుర్తిస్తారు? రాజ్యాంగం ఏం చెబుతోంది? పాస్‌పోర్ట్ పౌరసత్వ ధృవీకరణ పత్రం కాకపోతే.. అసలైన గుర్తింపు ఏది? ఎవరు భారతీయులో తేల్చేది ఎవరు వంటి సందేహాలు ఇప్పుడు సామాన్యుల మదిని తొలుస్తున్నాయి. విదేశీ వ్యవహా రాల శాఖ ఏం చెప్పింది.. మన దేశంలో చాలా మందికి పాస్‌పోర్ట్ ఉంటే అదే అసలైన పౌరసత్వ గుర్తింపు అని ఓ బలమైన నమ్మకం ఉంది. ఎవరైనా విదేశాలకు వెళ్లాలన్నా గుర్తింపు కార్డుగా చూపించాలన్నా అందరికీ ముందుగా గుర్తొచ్చేది పాస్పోర్టే. అయితే విదేశీ వ్యవహారాల శాఖ నుంచి వచ్చిన ఓ ప్రకటన ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పాస్‌పోర్ట్ వలం ప్రయాణ పత్రం మాత్రమేనని.. అది పౌరసత్వానికి నిదర్శనం కాదని ఇటీవల తేల్చి చెప్పింది. ఆధార్ డా వలం గుర్తింపు కార్డు మాత్రమేనని గతంలోనే తేల్చారు. ఇన్ని ప్రశ్నల మధ్య అసలు ఏంటన్నది ంద్రమే తేల్చాల్సి ఉంది. ంద్ర ప్రభుత్వంపైనే ఈ బాధ్యత ఉంది. పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా విదేశీ వ్యవహారాల శాఖ చేసిన ప్రకటన ఇప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. భారతీయులకు పాస్‌పోర్ట్ వలం ఒక ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమే నని స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారుల పటిష్టమైన విచారణ తర్వాతే పౌరులకు దీన్ని జారీ చేస్తారు. భారత రిపబ్లిక్ పేరుతో జారీ అయ్యే ఈ పత్రం ప్రపంచవ్యాప్తంగా ఆమోదం పొందుతుంది. అయితే ఇది ఒక వ్యక్తిని భారతీయ పౌరుడిగా గుర్తించేందుకు చట్టబద్ధమైన నిదర్శనం ఎంతమాత్రం కాదు. మిగతా దేశాలతో పోలిస్తే భారత పౌరసత్వ నిర్ధారణలో ఒక పెద్ద సమస్య దాగి ఉంది. అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో పౌరులందరికీ ఒ తరహా యూని వర్సల్ సిటిజన్ షిప్ సర్టిఫికెట్ ఉంటుంది. కానీ మన దేశంలో పౌరులందరికీ ఇచ్చే ఒ ఒక్క పౌరసత్వ ధృవీకరణ పత్రం అంటూ ఏదీ లేదు. ఎక్కువ మంది భారతీయుల పౌరసత్వం పుట్టుక ఆధారం గానే వస్తుంది. చాలామంది పాతతరం భారతీయులకు ఓటరు జాబితాలు, స్కూల్ సర్టిఫికెట్లు, భూమి రికార్డులే ప్రధాన ఆధారాలు. వీటన్నింటినీ క్రమబద్ధీకరించేందు ఎన్నార్సీ అమలును గతంలో ప్రతిపాదించారు. అసోంలో అమలు చేసిన ఎన్నార్సీలో సరైన డాక్యుమెంట్లు లేక దాదాపు 19 లక్షల మంది జాబితాలో చోటు కోల్పోయారు. అందు రాజ్యాంగం కల్పించిన పౌరసత్వ నిబంధనల పట్ల సరైన అవగాహన ఉండటం అత్యంత అవసరం. న్యాయపరమైన సవాళ్లు ఎదురైనప్పుడు.. కోర్టుల్లో పాస్‌పోర్ట్ చూపించి పౌరసత్వాన్ని నిరూపించుకోలేరు. భారత పౌరులు ఎవరనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 5 నుంచి 11 వరకు 1955 పౌరసత్వ చట్టం స్పష్టంగా నిర్వ చించాయి. ఈ చట్టాల ప్రకారం ఏ ఒక్క పత్రం డా పౌరసత్వానికి పూర్తి స్థాయి ఆధారంగా పరిగణించదు. పౌరసత్వం అనేది పుట్టుక.. తల్లిదండ్రుల మూలాలు.. నివాసం ఆధారంగా వచ్చే ఒక చట్టపరమైన హోదా. మన దగ్గర ఉన్న రికార్డులు వలం ఆ వాస్తవాలను నిర్ధారించే సాక్ష్యాలుగా మాత్రమే పనిచేస్తాయి. ఉదాహరణకు ఆధార్, ఓటర్ ఐడీ, పాన్ కార్డ్ లాంటివి గుర్తింపు కార్డులు మాత్రమే కానీ అవే పౌరసత్వానికి తుది ఆధారాలు కావు. 1955 పౌరసత్వ చట్టం ప్రకారం పౌరసత్వాన్ని నాలుగు మార్గాల్లో పొందవచ్చు. మొదటిది పుట్టుకతో వచ్చే పౌరసత్వం. 1950 నుంచి 1987 మధ్య భారత్‌లో జన్మించిన వారందరూ సహజంగా నే పౌరులు అవుతారు. ఆ తర్వాత 2003 వరకు జన్మించిన వారిలో తల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరైనా భారతీయులై ఉండాలి. ఇక రెండో మార్గం వారసత్వం. విదేశాల్లో పుట్టిన పిల్లల తల్లిదండ్రుల్లో ఒకరు భారతీయులై ఉండి.. ఏడాదిలోపు కాన్సులేట్‌లో నమోదు చేసుకుంటే పౌరసత్వం లభిస్తుంది. మూడోది రిజిస్ట్రేషన్ ద్వారా.. నాలుగోది నిర్దిష్ట కాలం దేశం లో ఉండటం ద్వారా పొందే పౌరసత్వం. ఇది కనీసం 12 ఏళ్ల పాటు భార త్‌లో నివసించిన విదేశీయులకు ఇస్తారు. పాకిస్థాన్ సింగర్ అద్నాన్ సవూ కి ఇలాగే భారత పౌరసత్వం లభించింది. పౌరులు కాని వారికి పాస్పోర్టు ఇవ్వడదనే నియమం కూడా ఏవూ లేదు. పాస్‌పోర్ట్ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం ంద్ర ప్రభుత్వం ప్రత్యేక పరిస్థితుల్లో విదేశీయులకు డా ట్రావెల్ డాక్యుమెంట్లు జారీ చేయవచ్చు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ అధికా రాన్ని కేంద్రం ఉపయోగిస్తుంది. రాజకీయ కారణాలతో ఏ దేశం లేని వాళ్లు గా మిగిలిపోయిన వారికి ఇలాంటి వెసులుబాటు ఇస్తారు. భారత్‌లో ఉంటున్న టిబెటన్ శరణార్థులకు, శ్రీలంక తమిళులకు వేరే దేశాలకు వెళ్లేందుకు ప్రత్యేక ప్రయాణ పత్రాలు జారీ చేస్తారు. ఇవన్నీ చూస్తే.. పాస్‌పోర్ట్ ఉంటే వారు పక్కా భారతీయులు అనుకోవడం పౌర పాటే అవుతుంది. పౌరసత్వ వివాదాలపై దేశంలోని అత్యున్నత న్యాయ స్థానాలు ఎన్నోసార్లు స్పష్టమైన తీర్పులు ఇచ్చాయి. సుప్రీంకోర్టు సహా పలు హైకోర్టులు పాస్పోర్టును ఒక గుర్తింపుగా మాత్రమే చూశాయి. ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం పాస్‌పోర్ట్, జనన ధృవీకరణ పత్రాలను బలమైన సాక్ష్యాలుగా అంగీకరిస్తుం ది. కానీ కోర్టులు మాత్రం పౌరసత్వ వివాదాల్లో వీటిని తుది ఆధారాలుగా అంగీకరించవు. పౌరసత్వాన్ని నిరూపించుకునే బాధ్యత పూర్తిగా సదరు వ్యక్తి పైనే ఉంటుందని కోర్టులు తేల్చి చెప్పాయి. ఆధార్‌ను పరిగణలోకి తీసుకోకుంటే సమగ్రమైన భారతీయతకు సంబంధించిన కార్డు లేదా పత్రం అవసరం ఏర్పడింది.

> ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం పాస్‌పోర్ట్, జనన ధృవీకరణ పత్రాలను బలమైన సాక్ష్యాలుగా అంగీకరిస్తుంది. కానీ కోర్టులు మాత్రం పౌరసత్వ వివాదాల్లో వీటిని తుది ఆధారాలుగా అంగీకరించవు. పౌరసత్వాన్ని నిరూపించుకునే బాధ్యత పూర్తిగా సదరు వ్యక్తి పైనే ఉంటుందని కోర్టులు తేల్చి చెప్పాయి. ఆధార్‌ను పరిగణలోకి తీసుకోకుంటే సమగ్రమైన భారతీయతకు సంబంధించిన కార్డు లేదా పత్రం అవసరం ఏర్పడింది.

EDITORIAL

మెనూ తప్పనిసరిగా అమలు చేయాలి

- **కలెక్టర్ హైమావతి**
- **విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం కడుపునిండా అందించాలంటూ ఆదేశాలు**

ప్రజానావ, సిద్దిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కింద కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని కడుపునిండా వడ్డించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం చిన్నకోడూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆమె, మధ్యాహ్న భోజన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నం, సాంబారు, వంకాయ, ఆలుగడ్డ, టమాటతో తయారుచేసిన కూరను తనిఖీ చేసి, విద్యార్థుల హాజరుకు అనుగుణంగా కూరగాయలను కొలత ప్రకారం వినియోగించారా, అందరికీ సరిపడా ఆహారం సిద్ధం చేశారా అనే అంశాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యా హ్న భోజనం చేసిన కలెక్టర్, వారితో ఆప్యాయంగా మాట్లాడి భోజనం నాణ్యత, మెనూ అమలు, ఆహారం సరిపోతుందా అనే అంశాలను తెలుసుకున్నారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట తహసీల్దార్ సలీం తదితరు లు పాల్గొన్నారు.

ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించాలి

- **ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**
- **అర్హులైన ఒక్క ఓటరు కూడా నమోదు ప్రక్రియకు దూరం కాకూడదు**

ప్రజానావ, నాగర్‌కర్నూల్: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తాడూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఆకస్మికంగా పర్యటించిన ఆయన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. బీఎల్ఓలు అందజేసిన ఎన్యూమరేషన్ పత్రాలను ప్రతి ఓటరు తప్పనిసరిగా పూర్తి చేసి తిరిగి సంబంధిత బీఎల్ఓకు అందజేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. పత్రాలు సమర్పించని పక్షంలో ఓటరు జాబితాలో పేరు నమోదు కాకపోయే అవకాశం ఉందనే విషయాన్ని ప్రతి కుటుంబానికి స్పష్టంగా వివరించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడం ప్రతి అధికారి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గడ్డం విజయ్ నివాసానికి వెళ్లి బీఎల్ఓ విజయ ఇంటింటికి వెళ్లి ఫారాల పంపిణీ, వివరాల సేకరణ, ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం బీఎల్ఓలతో నేరుగా మాట్లాడి క్షేత్రస్థాయిలో చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. ప్రజలకు ఫారాలను అందజేయడమే కాకుండా వాటిని ఎలా నింపాలి, ఏ కాలమ్‌లో ఏ వివరాలు నమోదు చేయాలి, ఎలాంటి ఆధార పత్రాలు జత చేయాలి, పూర్తి చేసిన ఫారాలను ఎప్పటిలోగా తిరిగి అందజేయాలనే అంశాలను ఓర్పుతో వివరించాలని సూచించారు. ప్రజల్లో ఎలాంటి సందేహాలు, అపోహలు లేకుండా అవగాహన కల్పించడం బీఎల్ఓల ప్రధాన బాధ్యత అని తెలిపారు. ఇంటి వద్ద అందుబాటులో లేని వారికి మరోసారి వెళ్లి ఫారాలు అందించాలని, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు సహా ప్రతి అర్హుడికి ఎన్యూమరేషన్ పత్రాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అనంతరం అక్కడి ఓటర్లతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొని గడువులోగా పత్రాలు సమర్పించాలని కోరారు. ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి మూల స్తంభమని, అందులో ప్రతి అర్హుడి పేరు ఉండటం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఇదే సందర్భంగా కాలనీలోని ఎర్రోళ్ల నాగమణి అనే మహిళ తనకు పూరిగుడిసె మాత్రమే ఉందని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరగా, స్పందించిన కలెక్టర్ రెండో విడతలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే గృహ నిర్మాణం చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ పర్యటనలో తాడూరు తహసీల్దార్ రామకృష్ణ, ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ అధికారులు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం సాగుకు యూరియా కొరత లేదు

- **కలెక్టర్ దివాకర్ టీఎస్**
- **జిల్లాలో సమృద్ధిగా ఎరువుల నిల్వలు**
- **రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**

ప్రజానావ, ఖమ్మం: జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, వానాకాలం పంటల సాగుకు అవసరమైన మేర పూర్తి స్థాయిలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ తెలిపారు. జిల్లాలోని అన్ని సహకార సంఘాల గోడౌన్లు, విక్రయ కేంద్రాల్లో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పర్యవేక్షణ చేపడుతున్నట్లు వెల్లడించారు. జిల్లాకు ఇప్పటివరకు 18,832.34 మెట్రిక్ టన్నుల యూరియా చేరుకోగా, పాత నిల్వలను కలుపుకుని మొత్తం 24,903.7 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి వచ్చిందన్నారు. ఇందులో ఇప్పటివరకు 6,071.13 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయమైనట్లు తెలిపారు. మంగళవారం చింతకాని మండలంలోని నాగులవంచ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఎరువుల గిడ్డంగులు, విక్రయ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్లలో నిల్వ ఉన్న యూరియా, ఇతర ఎరువులను పరిశీలించి, స్టాక్ రిజిస్టర్‌లో నమోదైన వివరాలకు అనుగుణంగా నిల్వలు అందుబాటులో ఉన్నాయా లేదా అన్న విషయాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని ఎరువుల బస్తాలు వచ్చాయి, ఎన్ని పంపిణీ చేశారు, ఇంకా ఎంత పరిమాణంలో నిల్వలు రావాల్సి ఉందనే అంశాలపై వ్యవసాయశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం యూరియా బుకింగ్ యాప్ పనితీరును రైతుల మొబైల్ ఫోన్లలో స్వయంగా పరిశీలించిన కలెక్టర్, యాప్ ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా లభ్యతపై రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని సూచించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న యూరియా బుకింగ్ యాప్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఎరువుల పంపిణీ కోసం అనుసరిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ యాప్ వల్ల ఎలాంటి నష్టం లేదని, గత రబీ సీజన్‌లో కూడా రైతులకు ఇబ్బందులు లేకుండా విజయవంతంగా అమలు చేసినట్లు గుర్తుచేశారు. ఎరువులు పక్కదారి పట్టకుండా పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా పంపిణీ చేసేందుకు యాప్ దోహదపడుతుందని, రైతులు దీనిపై అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. జిల్లాతో పాటు మండల స్థాయిలో అందుబాటులో ఉన్న స్టాక్ వివరాలు కూడా యాప్ లో తెలుసుకునే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన ఉండాలని తెలిపారు. ప్రయోగాత్మకంగా కొంతమేర నానో యూరియాను వినియోగించి దాని ఫలితాలను స్వయంగా పరిశీలించాలని రైతులకు సూచించారు. రైతులను నానో యూరియా కొనుగోలు చేయాలని డీలర్లు బలవంతం చేయవద్దని, వారు కోరిన ఎరువులు మాత్రమే అందించాలని స్పష్టం చేశారు. ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు పంటల అవసరానికి అనుగుణంగా మాత్రమే ఎరువులు, క్రిమిసంహారక మందులను వినియోగించాలని, మోతాదుకు మించి వాడకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార శాఖ అధికారి గంగాధర్, చింతకాని మండల తహసీల్దార్ కిలారి బాబ్జీ, ఎంపీడీవో శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి అవసరం

సీపీ సాధన రష్మీ పెరుమాళ్

ప్రజానావ,. గజ్వేల్ : నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సిద్ధిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ సూచించారు. మంగళవారం గజ్వేల్ రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఆమె వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో కల్పించిన సౌకర్యాలు, రికార్డుల నిర్వహణ, భద్రతా చర్యలు, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. అనంతరం అధికారులతో సమావేశమై కార్యాలయ పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే అంశాలపై పలు సూచనలు చేశారు. పోలీస్ కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండటంతో పాటు సిబ్బందికి అనుకూలమైన వాతావరణం కల్పించడం ద్వారా సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని ఆమె పేర్కొన్నారు. నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. అనంతరం గజ్వేల్ రూరల్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటిన సీపీ, నూతనంగా ఏర్పాటు చేసిన ఆరు సీసీ కెమెరాలు, వాహన పార్కింగ్ షెడ్‌ను ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నరసింహులు, సీఐ రవిరాజు, ఎస్సైలు ఆరోగ్యం, రఘుపతి, కృష్ణారెడ్డి, యునుస్ ఖాన్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలేరు అభివృద్ధికి సీఎం గ్రీన్ సిగ్నల్

ప్రజానావ, ఆలేరు : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రితో సుదీర్ఘంగా చర్చించినట్లు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్ల నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు త్వరలోనే పరిహార నిధులను విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. అలాగే వైటిడీఏ పరిధిలో భూములు కోల్పోయిన వారికి కూడా న్యాయం చేస్తామని సీఎం స్పష్టం చేసినట్లు తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలో చేపట్టాల్సిన రహదారుల నిర్మాణం, తాగునీటి సదుపాయాల విస్తరణ, విద్యా మరియు వైద్య రంగాల అభివృద్ధి, సాగునీటి వసతుల మెరుగుదలతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, అవసరమైన ప్రత్యేక నిధులను కేటాయించి అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు.

భద్రాద్రిలో భారీ గంజాయి స్మగ్లింగ్ భగ్నం

- **కంటైనర్‌లో రహస్య అరల ద్వారా అక్రమ రవాణా**
- **రూ.2—3 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం**
- **నలుగురు నిందితుల అరెస్ట్.. లారీ, మొబైల్ ఫోన్లు స్వాధీనం**

ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం: సినీ కథను తలపించే రీతిలో కంటైనర్ లారీలో ప్రత్యేకంగా రహస్య అరలను ఏర్పాటు చేసి కోట్ల రూపాయల విలువైన గంజాయిని అక్రమంగా తరలిస్తున్న అంతర్రాష్ట్ర స్మగ్లింగ్ ముఠా గుట్టును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు రట్టు చేశారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల నుంచి ఉత్తరప్రదేశ్‌కు రహస్యంగా సాగుతున్న ఈ అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను పక్కా సమాచారంతో బూర్గం పాడు మండలం సారపాక వద్ద పోలీసులు చాకచక్యం గా అడ్డుకుని, రూ.2 నుంచి రూ.3 కోట్ల విలువైన గం జాయితో పాటు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రముఖ పారిశ్రామిక ప్రాంతమైన సారపాకలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో భారీ ఎత్తున గంజాయి తరలిస్తున్న కంటైనర్ లారీ బయటపడింది. జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై ఇప్పటికే కఠిన చర్యలు చేపడుతున్న పోలీస్ యంత్రాంగం పక్కా సమాచారంతో సారపాకలోని గోదారమ్మ క్యాంప్ కార్యాలయం సమీపంలో ముమ్మర తనిఖీలు నిర్వహించింది. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి భద్రాచలం మీదుగా వస్తున్న ఒక కంటైనర్ లారీని అనుమానాస్పదంగా గుర్తించి నిలిపివేశారు. వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా అందులో భారీ మొత్తంలో అక్రమంగా తరలిస్తున్న గంజాయి మూట లు బయటపడటంతో అధికారులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. ఎలాంటి అనుమానం రాకుండా ఉండేందుకు స్మగ్లర్లు కంటైనర్ లోపల ప్రత్యేకంగా రహస్య అరలను నిర్మించి వాటిలో గంజాయిని దాచి సుదూర ప్రాంతాలకు తరలించే ప్రయత్నం చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో సుమారు రూ.2 నుంచి రూ.3 కోట్ల వరకు ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ సంఘటనా స్థలానికి చేరుకుని పట్టుబడిన కంటైనర్ లారీతో పాటు అందులో ఏర్పాటు చేసిన రహస్య అరలను పరిశీలించారు. స్మగ్లర్లు వినియోగి స్తున్న సరికొత్త పద్ధతులపై పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రాథమిక విచారణలో ఈ లారీ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల నుంచి బయలుదేరి భద్రాచలం మీదుగా ఉత్తరప్రదే శ్‌కు వెళ్తున్నట్లు సమాచారం లభిం చింది. పోలీసులు వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్‌తో పాటు ఈ రవాణాతో సంబంధం ఉన్న మరో ముగ్గురి ని కలిపి మొత్తం నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. నిందితుల మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకుని కాల్ డేటా ఆధారంగా లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ గంజాయి రవాణా వెనుక ఉన్న ప్రధాన ముఠా సభ్యులు, వారి కార్యకలా పాలు ఏ ప్రాంతాలకు విస్తరించాయనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఇదిలా ఉండగా పట్టుబడిన కంటైన ర్ లారీని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించకుండా సారపాకలోని ఐటీసీ పేపర్ బోర్డు ప్రాంగణంలో భద్రంగా ఉంచడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ వాహనానికి ఎస్కార్ట్ వాహనాలు ఉన్నాయా లేదా దీనికి సంబంధించి మరిన్ని లారీల కదలికలు ఉన్నా యా అనే అంశాలపై సమాచారం సేకరించేందుకే పోలీసులు ఈ వ్యూహాత్మక చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా ఆంధ్ర—ఒడిశా సరిహద్దు ప్రాంతాలైన మల్కానగిరి, శీలేరు అటవీ ప్రాంతాల నుంచి తెలంగాణ మీదుగా హైదరాబాద్, నల్గొండ తదితర ప్రాంతాలకు, అక్కడి నుంచి ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు ఈ అక్రమ రవాణా నెట్‌వర్క్ విస్తరించినట్లు సమాచారం ఉందని పోలీసులు తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో పోలీసుల నిరంతర నిఘాతో దాదాపు ఒక టన్ను గంజాయిని స్వాధీనం చేసుకుని కోట్ల రూపాయల విలువైన సొత్తును సీజ్ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను బుధవారం నిర్వహించే అధికారిక మీడియా సమావేశంలో వెల్లడించనున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు.

బాలల రక్షణే లక్ష్యంగా ‘ఆపరేషన్ ముస్కాన్’

- **ఎస్పీ రోహిత్ రాజు**
- **బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా**

ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం: బాలల సంరక్షణే ప్రధాన ధ్యేయంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా జూలై 1 నుంచి 31వ తేదీ వరకు ‘ఆపరేషన్ స్మైల్/ముస్కాన్’ ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పిలుపునిచ్చారు. సమాజహితమే లక్ష్యంగా పోలీస్ శాఖ చేపడుతున్న ఈ ప్రత్యేక డ్రైవ్ ద్వారా జిల్లాలో చిన్నారుల రక్షణకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. గత 12 ఏళ్లుగా దేశవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతున్న ఈ కార్యక్రమం ద్వారా తప్పిపోయిన పిల్లలు, భిక్షాటన చేస్తున్న బాలలు, నిర్లక్ష్యానికి గురైన చిన్నారులు, బాల కార్మికులను గుర్తించి రక్షించడంతో పాటు వారిని సురక్షితంగా వారి కుటుంబాలకు అప్పగించడమే ప్రధాన ఉద్దేశమని ఎస్పీ వెల్లడించారు. ఈ నెల రోజుల పాటు జిల్లా పరిధిలో ప్రత్యేక పోలీస్ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్ ప్రాంతాలు, హోటళ్లు, పరిశ్రమలు, ఇతర ప్రజా ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రమాదంలో ఉన్న బాలలను గుర్తించి వారికి తగిన సంరక్షణ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. సమాజంలో ఎక్కడైనా బాల కార్మికులు, భిక్షాటనలో ఉన్న లేదా తప్పిపోయిన పిల్లలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. జిల్లాలో బాలల భద్రతను మరింత పటిష్టం చేయడంతో పాటు వారి ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రజలందరూ బాధ్యతగా పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ రోహిత్ రాజు విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- **కలెక్టర్ దివాకర్ టీఎస్**



ప్రజానావ, ఖమ్మం: సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న వసతి గృహాల్లో విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్‌లతో కలిసి సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, సంబంధిత ఆర్‌సీఓలతో హాస్టళ్ల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంక్షేమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టళ్లలో తాగునీరు, విద్యుత్, టాయిలెట్లు, డార్మిటరీలు, ఫర్నిచర్, వంటశాల, డైనింగ్ హాల్, భద్రతా ఏర్పాట్లు తదితర సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా బీసీ, సాంఘిక సంక్షేమ అధికారిణి జి.జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయలక్ష్మి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్, ఆయా శాఖల ఆర్‌సీఓలు, విద్యుత్ శాఖ ఏఈవో కె. శ్రీధర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో సర్ ఇంచార్జ్‌లతో సమీక్ష

ప్రజానావ, గోదావరిఖని: భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం సర్ పురోగతిపై రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మంగళవారం రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇంచార్జ్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఇంటికి చేరుకుని సర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో అధికారులు, ఇంచార్జ్‌లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. సర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని, అవసరమైన పత్రాల సేకరణలో ప్రజలకు సహకరించాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో, గ్రామాల్లో రోజువారీ పురోగతిని పర్యవేక్షిస్తూ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డివిజన్, గ్రామాల ఇంచార్జ్‌లు తమ పరిధిలో జరుగుతున్న సర్ కార్యక్రమం పురోగతిని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సమావేశం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

- **సింగరేణి అధికారుల రిలే దీక్షలకు టీడీపీ, టీఎన్‌టీయూసీ మద్దతు**
- **జీతాల అప్‌గ్రేడ్, పీఆర్‌పీ, పీఆర్‌సీ అమలు చేయాలని డిమాండ్**

ప్రజానావ, రామగుండం: బొగ్గు గనుల అధికారుల అసోసియేషన్ డిమాండ్ల సాధన కోసం ఆర్జీ–1 జీఎం కార్యాలయం ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. అధికారుల డిమాండ్ల సాధనకు మద్దతుగా తెలుగుదేశం పార్టీ అనుబంధ కార్మిక సంఘం టీఎన్‌టీయూసీ నాయకులు, టీడీపీ నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. నిమ్మకాయల ఏడుకొండలు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులను సైతం ఇబ్బందులకు గురిచేస్తూ నిరాహార దీక్షలు చేపట్టే పరిస్థితులు తీసుకువచ్చిందని విమర్శించారు. సింగరేణి పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న అధికారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. అధికారులకు జీతాల అప్‌గ్రేడ్‌తో పాటు పీఆర్‌పీ, పీఆర్‌సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెగడపల్లి రాజానర్సు, కామెర రాజబాబు, కొండి శ్రీనివాస్, బేక్కం వీరేందర్, గుండబోయిన ఓదెలు, మాటేటి లక్ష్మి , నరెడ్డి స్వరాజ్యం, చిట్యాల అశ్విని, రామగిరి రాజేశ్వరి, సుందిల్ల స్వామి, ఇందారం రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

Singareni news

భాస్కరరావు సేవలు చిరస్మరణీయం

ప్రజానావ, రామగుండం: సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకుడు మాదిరెడ్డి భాస్కరరావు సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు కొనియాడారు. మంగళవారం గోదావరిఖనిలో భాస్కరరావు 35వ వర్ధంతి సభను సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భాస్కరరావు కార్మికుల హక్కుల సాధన కోసం అనేక పోరాటాలు చేశారని, కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో విశేష కృషి చేశారని పేర్కొన్నారు. అలాంటి గొప్ప నాయకుడిని కొందరు అరాచకవాదులు హత్య చేసి కార్మికులకు తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆశయాల సాధన దిశగా యూనియన్ ముందుకు సాగుతూ కార్మికుల హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమానికి ముందు జీఎం కార్యాలయం వద్ద ఉన్న భాస్కరరావు విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కె. స్వామి, బ్రాంచ్ కార్యదర్శి రంగు శ్రీనివాస్, భాస్కరరావు కుమారుడు శేష కుమార్, నాయకులు సంకె అశోక్, మాదన మహేష్, పార్టీ నాయకులు గోసిక మోహన్, కన్నం లక్ష్మి నారాయణ, కనకరాజు, సూర్య, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు

- **21వ డివిజన్‌లో సర్ ప్రత్యేక మ్యాపింగ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

ప్రజానావ, గోదావరిఖని: భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం (సర్ ప్రత్యేక మ్యాపింగ్)లో భాగంగా రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 21వ డివిజన్‌లో నిర్వహించిన ప్రత్యేక మ్యాపింగ్ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) నిర్వహిస్తున్న సర్వే వివరాలను తెలుసుకొని, అధికారులు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రజలు ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలి. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు), కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మంచిర్యాల రూరల్ సర్కిల్ కార్యాలయం తనిఖీ

- **ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి**
- **మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్**

ప్రజానావ, మంచిర్యాల : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్ డీసీపీ ఏ.భాస్కర్ మంగళవారం మంచిర్యాల రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు,వాటి దర్యాప్తు వివరాలను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌ను అడిగి తెలుసుకున్నారు. సర్కిల్ పరిధిలో రోజువారీగా నమోదవుతున్న ఫిర్యాదులు,కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి,పెండింగ్ కేసుల స్థితిగతులు, నిందితుల అరెస్టులు, కేసుల దర్యాప్తు పురోగతికి సంబంధించిన ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, పోలీసు అధికారులు, సిబ్బంది విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలకు మరింత నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్, ఈ–సాక్ష్య వంటి డిజిటల్ వ్యవస్థల ద్వారా కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలను శాస్త్రీయంగా నమోదు చేసి, దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. పోలీసు సిబ్బంది హెచ్‌ఆర్ఎంఎస్ ద్వారా అందుబాటులో ఉన్న సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని, అలాగే పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి,వారి సమస్యలకు సత్వర పరిష్కారం అందేలా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. మంచిర్యాల రూరల్ సర్కిల్ మొత్తం పనితీరు సంతృప్తికరంగా ఉందని డీసీపీ అభినందిస్తూ,ఇదే సేవాస్ఫూర్తితో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

వైభవంగా బద్ది పోచమ్మ బోనాల ఉత్సవం

- **భక్తులతో స్వయంగా మాట్లాడి, ఇబ్బందులు అడిగి తెలుసుకున్న ఈవో**

ప్రజానావ, వేములవాడ: దక్షిణ కాశీగా పేరుగాంచిన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధాలయమైన శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారి సన్నిధి భక్తుల జయజయధ్వానాలతో, ఆధ్యాత్మిక కోలాహలంతో మార్మోగింది. స్వామివారిని దర్శించుకుని పునీతులైన భక్తులు, మంగళవారం తెల్లవారుజాము నుంచే అమ్మవారి ఆలయానికి పోటెత్తారు. తమ ఇలవేల్పు అయిన బద్ది పోచమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాల మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు సాంప్రదాయబద్ధంగా తలపై బోనాలతో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన బోనాలు, పట్నాలు, బెల్లం కల్లు , సాక లు , ఓడి బియ్యం, మరియు చీరె సారెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ ప్రాంగణమంతా మంగళహారతులు, కర్పూర నీరాజనాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

క్షేత్రస్థాయిలో ఈవో రమాదేవి పర్యవేక్షణ.. భక్తులకు భరోసా

రాష్ట్రం నలుమూలల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి గారు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. బద్ది పోచమ్మ గుడిలోని క్యూలైన్లు, బోనాల సమర్పణ స్థలాలను నిశితంగా పరిశీలించారు. ఎండ తీవ్రత, రద్దీ దృష్ట్యా భక్తులకు తాగునీరు, నీడ వంటి కనీస వసతుల్లో లోపాలు రాకుండా చూడాలని అక్కడికక్కడే ఆలయ సిబ్బందికి, అర్చకులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. భక్తుల రక్షణ, పారదర్శకతను పరిశీలించే క్రమంలో ఈవో గారు క్యూలైన్లలో ఉన్న భక్తుల వద్దకు వెళ్లి, వారు కొనుగోలు చేసిన కల్లు బెల్లం, సాక , మరియు పట్నాల టికెట్లను స్వయంగా తనిఖీ చేశారు. భక్తులతో ఈవో రమాదేవి గారు స్వయంగా ముఖాముఖి మాట్లాడారు. దర్శనంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? కొబ్బరికాయలు కొట్టే స్థలంలో కానీ, బోనాలు–పట్నాలు సమర్పించే చోట కానీ సిబ్బంది ఎవరైనా మిమ్మల్ని అదనంగా డబ్బులు (పైసలు) డిమాండ్ చేస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఆమె పలు కీలక సూచనలు చేశారు: హుండీలోనే కానుకలు: భక్తులు ఆలయంలో ఎవరికీ చేతికి రూపాయి కూడా ఇవ్వకూడదు. మీకు తోచిన కానుకలు, ముడుపులు ఏవైనా ఉంటే కేవలం ఆలయ హుండీలోనే వేయాలి.

రశీదులు తప్పనిసరి

దేవస్థాన పూజలు, సేవల కొరకు కేవలం అధికారిక కౌంటర్లలో టికెట్లు మాత్రమే కొనుగోలు చేయాలి. భక్తులను ఎవరైనా డబ్బులు అడిగి ఇబ్బంది పెడితే, వెంటనే అక్కడ విధుల్లో ఉన్న ఉన్నతాధికారులకు సమాచారం అందించాలి. లేదా నేరుగా ఈవో కార్యాలయంలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చు. అవినీతికి పాల్పడే సిబ్బందిపై కఠినమైన శాఖాపరమైన చర్యలు ఉంటాయి. వేములవాడ క్షేత్ర సందర్శనంలో శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారి దర్శనానికి ఒక విశిష్టమైన స్థానం ఉంది. ఇక్కడి సాంప్రదాయం మరియు భక్తుల నమ్మకం ప్రకారం ఈ ఆలయానికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి: ప్రథమ దర్శనం – యాత్రా సంపూర్ణం: వేములవాడ వచ్చే భక్తులు మొదట , స్వామివారిని దర్శించుకొని ఆ తరువాత శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకోవడం ఇక్కడ ఎన్ని సంవత్సరాలు నుండి వస్తున్న ఆనవాయితీ చల్లని తల్లి.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి: ఉత్తర తెలంగా ణలోనే అత్యంత మహిమాన్వితమైన శక్తి స్వరూపిణి గా బద్ది పోచమ్మ అమ్మవారు పూజలందుకుంటు న్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, కలరా, స్మాల్‌పాక్స్ (అమ్మవారు) వంటి వ్యాధులు సోకినప్పుడు, అమ్మవారికి కల్లు సాక పోసి, వేప ఆకులతో పూజిస్తే ఉపశమనం లభిస్తుందని నమ్ముతారు. మంగళ, ఆదివారాల ప్రత్యేకత: వారంలో అన్ని రోజులూ పూజలు జరిగినప్పటికీ, మంగళవారం మరియు ఆదివారాల్లో అమ్మవారికి విశేష పూజలు నిర్వహి స్తారు. ఈ రెండు రోజుల్లో వేల సంఖ్యలో మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు వండి, ముత్యాల ముగ్గులు వేసి, పట్నాలు వేయించి అమ్మవారి కృపకు పాత్రుల వుతారు. ఈ విధంగా ఆలయ అధికారులు తీసుకున్న ముందస్తు చర్యలు, నిరంతర పర్యవేక్షణ కారణంగా భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్యం

అడిషనల్ కలెక్టర్ విక్టర్

ప్రజానావ, కామారెడ్డి: రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్యం అందించి ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రహవీర్, ప్రధానమంత్రి రహత్ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్ పథకాల అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ప్రజలు స్పందించి బాధితులను సమీప ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ప్రమాదం జరిగిన తొలి గంటలోపు బాధితుడిని ఆసుపత్రికి చేర్చి ప్రాణాలను కాపాడిన వారికి కేంద్ర ప్రభుత్వం తరపున రూ.25 వేల నగదు ప్రోత్సాహకం అందజేస్తుందని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి రూ.1.5 లక్షల వరకు ఎలాంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేకుండా ఉచిత వైద్యం అందించే ప్రధాన మంత్రి రహత్ పథకం అమలులో ఉందన్నా రు. ఈ పథకం కింద ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రమాదం జరిగిన తేదీ నుంచి ఏడు రోజుల వరకు ఉచిత వైద్యం అందించబడుతుందని, గరిష్టంగా రూ.1.5 లక్షల వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని పేర్కొన్నారు. జాతీయ రహదారులతో పాటు ఏ రహదారిపై జరిగిన ప్రమాదానికైనా ఈ పథకం వర్తిస్తుందని, రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రతి బాధితుడు ఈ పథకానికి అర్హుడని తెలిపారు. అలాగే రహవీర్ పథకం కింద ప్రమాద బాధితుడికి వెంటనే సహాయం చేసిన వారికి రూ.25 వేల నగదు ప్రోత్సాహకం అందిస్తారని, సహాయకులకు పోలీసు లేదా కోర్టు ఇబ్బందుల భయం ఉండదని, వారి హక్కులకు చట్టపరమైన రక్షణ కూడా ఉంటుందని వివరించారు. ఒక వ్యక్తి సంవత్సరానికి గరిష్టంగా ఐదు సార్లు ఈ ప్రోత్సాహకాన్ని పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం నిర్వహించిన అభినందన కమిటీ సమావే శానికి అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సమావే శంలో జిల్లా అదనపు పోలీసు సూపరింటెం డెంట్, జిల్లా రవాణా అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే ఎంఎస్. రాజ్ ఠాకూర్

ప్రజనావ, రామగుండం: రామగుండం నియోజకవర్గం : రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో రైతు భరోసా నిధులను విడుదల చేస్తోందని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. మంగళవారం బ్రాహ్మణపల్లి గ్రామంలో రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ... రైతు భరోసా పథకం ద్వారా రైతులకు వ్యవ సాయ పెట్టుబడి భారం తగ్గి, సాగుకు అవసరమైన ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా ప్రసూతి సేవలు

- **పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాజాసింగ్**

ప్రజానావ, పెద్దపల్లి : సమాజంలో ప్రతి గర్భిణీకి నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులో ఉండటం అత్యవసరమని గోషామహల్ ఎమ్మెల్యే టైగర్ రాజాసింగ్ అన్నారు. విశ్వహిందూ పరిషత్ సారథ్యంలోని విశ్వహిత సేవా ట్రస్ట్, ప్రియాంక మెటర్నిటీ క్లినిక్ ఆద్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన గర్భిణీ స్త్రీలకు ఉచితంగా ప్రసూతి సేవలు (డెలివరీ) సదుపాయాన్ని అందించే ప్రచార పోస్టరును ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా ప్రజలకు ప్రియాంక మెటర్నిటీ క్లినిక్ తీసుకున్న నిర్ణయం గొప్పవరమని ఆనందం వ్యక్తం చేశారు. వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టిన ఆసుపత్రి నిర్వహకులను అభినందించారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ స్వరూప్ కిరణ్ గౌడ్ మాట్లాడుతూ సమాజ సేవే లక్ష్యంగా విశ్వహితసేవ ట్రస్ట్, ప్రియాంక మెటర్నిటీ క్లినిక్ ఉచిత ప్రసూతి సేవలను అందిస్తాయని తెలిపారు. అదేవిధంగా పుట్టిన శిశువు ఆరోగ్య పరిరక్షణకు సైతం ప్రత్యేక ప్రాధాన్యతను ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. వైద్యసేవలు కావల్సిన గర్భిణీ స్త్రీలు 94922 02108 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చునని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో విశ్వహిందూ పరిషత్ నేతలు, ట్రస్ట్ ప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలపై పెరుగుతున్న నమ్మకం

- **తల్లి దండ్రుల నమ్మకాన్ని ఉపాధ్యాయులు నిలబెట్టాలి..**
- **మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు**
- **మల్లాపూర్ గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన మంత్రి అడ్లూరి**

ప్రజానావ, ధర్మారం: గురుకుల పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు రోజు రోజుకి నమ్మకం పెరుగుతుందని ఇందుకు ప్రధాన కారణం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన మార్పులే ప్రధాన కారణం అని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్ గురుకుల పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న అల్పాహారం, భోజనం మెనూపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో భాగంగా కిచెన్, డైనింగ్ హాల్ తో పాటు స్టోర్ రూమ్ ను మంత్రి పరిశీలించారు. మల్లాపూర్ గురుకుల పాఠశాలకు సరఫరా చేసిన సన్న బియ్యాన్ని మంత్రి పరిశీలించారు. బియ్యంలో నూకల శాతం ఎక్కువ ఉన్నందున బియ్యాన్ని వెనక్కి తీసుకొని సూపర్ ఫైన్ క్వాలిటీ బియ్యాన్ని పంపించాలని పెద్దపల్లి జిల్లా పౌరసరఫరాల అధికారికి మంత్రి మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల గురుకుల పాఠశాలలో 27 లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ విద్యను అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల కు యూనిఫామ్స్ తో పాటు విద్యార్థులకు సంబంధించిన అన్ని రకాల వస్తువులను అందించడానికి చర్యలు తీసుకున్నారని మంత్రి వివరించారు. గురుకుల పాఠశాలలో మైనర్ రిపేర్ల కోసం రూ. 69 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. గురుకుల పాఠశాలలోపై తల్లిదండ్రులకు రోజు రోజుకి నమ్మకం పెరుగుతుంది అని ఎందుకు తగ్గట్టుగా విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందని అందించాలని ఈ సందర్భంగా మంత్రి గురుకుల పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. గురుకులాల్లో ఉండే విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకోవాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురుకుల పాఠశాలను మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రత్యేక నిధులు తీసుకువస్తానని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంత్రి వెంట ధర్మారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, ధర్మారం మార్కెట్ కమిటీ చైర్మన్ రూప్లనాయక్ తదితరులు ఉన్నారు.

మీ సేవలు పోలీసు శాఖకు చిరస్మరణీయం

- **అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కే.శ్రీనివాస్**
- **విశిష్ట సేవలు అందించిన పోలీసు సిబ్బందికి సన్మానం**

ప్రజానావ, రామగుండం: ఉద్యోగ విరమణ పొందుతున్న ఎస్ఐలు ఠాకూర్ సహదేవ్ సింగ్,మహమ్మద్ అహ్మదుల్లా, మేకల మహేందర్‌రెడ్డి, ఏఎస్ఐలు బోయ శ్రీనివాస్, మహమ్మద్ అమానుల్లా,ఏఆర్ ఎస్ఐ పి. వెంకటేశ్వర్లు,హెడ్ కానిస్టేబుల్ బొట్ల చేరాలులను మంగళవారం అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్ కమిషనరేట్ కార్యాలయంలో పూలమాలలు వేసి, శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్ మాట్లాడుతూ, మూడు దశాబ్దాలకు పైగా పోలీసు శాఖలో క్రమశిక్షణ,నిజాయితీ, అంకితభావంతో సేవలందించిన సహోద్యోగులు ఈ రోజు తమ ఉద్యోగ జీవితానికి వీడ్కోలు పలుకుతున్నారని తెలిపారు.పోలీసు ఉద్యోగం అనేది కేవలం ఉపాధి మాత్రమే కాదని, ప్రజల భద్రత కోసం వ్యక్తిగత సుఖాలు, కుటుంబ సమయాన్ని సైతం త్యాగం చేస్తూ నిర్వర్తించే గొప్ప బాధ్యత అని అన్నారు.పగలు,రాత్రి అనే తేడా లేకుండా ప్రజల రక్షణ కోసం మీరు అందించిన సేవలు పోలీసు శాఖ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.మీ అనుభవం, క్రమశిక్షణ, సేవాభావం యువ పోలీసు సిబ్బందికి ఎల్లప్పుడూ ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు.విధి నిర్వహణలో మీరు సంపాదించిన గౌరవం, ప్రజల విశ్వాసం, మంచి పేరు మీ జీవితంలో అత్యంత విలువైన సంపద అని కొనియాడారు.ఉద్యోగ విరమణ అనేది సేవా జీవితానికి ముగింపు మాత్రమేనని, జీవితంలో కొత్త అధ్యాయానికి ఆరంభమని పేర్కొన్నారు.ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ,మీ అనుభవాన్ని సమాజానికి మార్గదర్శకంగా అందించాలని ఆకాంక్షించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ తరపున ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసు అధికారులకు, సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తూ,వారు చేసిన సేవలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని అన్నారు. పదవీ విరమణ అనంతర జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కొనసాగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, వారికి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ కె.శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్,ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్,ఏఆర్ ఏసీపీ రమేష్,సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ గోపి, ఆర్ఐలు దామోదర్, శేఖర్,పెద్దన్న,రమేష్, సీపీఓ సూపరింటెండెంట్లు ఇంద్రసేనారెడ్డి, మనోజ్ కుమార్, సందీప్, సంధ్య,సీసీ హరీష్, ఆర్ఎస్ఐలు వెంకట్, సరిత,పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు పోచలింగం తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి దేవస్థాన హుండీ ఆదాయం రూ.85.03 లక్షలు

ప్రజానావ, వరంగల్ : వరంగల్ మహానగరంలోని చారిత్రాత్మక శ్రీ భద్రకాళి దేవస్థానంలో హుండీలను మంగళవారం విప్పి లెక్కింపు నిర్వహించగా రూ.85,03,997 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ రామల సునీత తెలిపారు. ఈ మొత్తాన్ని యూనియన్ బ్యాంక్ కేఎంసీ బ్రాంచ్‌లో జమ చేసినట్లు వెల్లడించారు. హుండీ లెక్కింపులో భారత కరెన్సీతో పాటు విదేశీ కరెన్సీ కూడా లభించినట్లు తెలిపారు. అందులో 200 అమెరికన్ డాలర్లు, 260 కెనడా డాలర్లు, 30 యూఏఈ దిర్హామ్‌లు, 30 బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ పౌండ్లు, 300 సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఒమన్ కరెన్సీ, 2 సింగపూర్ డాలర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే హుండీలో లభించిన మిశ్రమ బంగారం, వెండి వస్తువులను తిరిగి హుండీలోనే ఉంచినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ ఉప కమిషనర్ కార్యాలయ పర్యవేక్షకులు ఈ. గౌరీశంకర్, దేవాలయ ఈఓ ఏసీ రామల సునీత, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, శ్రీలక్ష్మి , శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి అధ్యక్షుడు జి. నవీన్, శ్రీలక్ష్మి శ్రీనివాస సేవా ట్రస్ట్ అధ్యక్షుడు జి. కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 200 మంది సభ్యులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన త్రిచక్ర వాహనం

- ఈజిప్టులో ఘటన.. తొమ్మిది మంది చిన్నారులు మృతి

కైరో: ఈజిప్టులో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. దక్షిణ ఈజిప్టులోని అస్సియుట్ ప్రావిన్స్‌లో చిన్నారులతో వెళ్తున్న మోటరైజ్డ్ త్రిచక్ర వాహనం (ట్రైసైకిల్) అదుపుతప్పి కాలువలో పడిపోవడంతో తొమ్మిది మంది చిన్నారులు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. స్థానిక అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. అస్సియుట్ ప్రావిన్స్‌లోని అబూ టిగ్ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. స్థానిక మీడియా కథనాల ప్రకారం, సమీపంలోని వ్యవసాయ క్షేత్రాల్లో పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న చిన్నారులను తీసుకెళ్తున్న త్రిచక్ర వాహనం స్టీరింగ్‌లో లోపం ఏర్పడటంతో అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో మృతి చెందిన చిన్నారుల వయస్సు 10 నుంచి 17 సంవత్సరాల మధ్య ఉన్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. గాయపడిన ఇద్దరిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితిపై అధికారులు ఇంకా వివరాలు వెల్లడించలేదు. మృతదేహాలను అబూ టిగ్ ఆసుపత్రికి తరలించారు.

విస్తృత సహాయక చర్యలు

ఘటన సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు, గజ ఈతగాళ్లు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై అస్సియుట్ గవర్నర్ మొహమ్మద్ ఎల్వాన్ స్పందిస్తూ, భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా కాలువల వెంట కాంక్రీట్ రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని, ఇతర భద్రతా చర్యలను వెంటనే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

తరచూ రోడ్డు ప్రమాదాలు

ఈజిప్టులో నాసిరకం రహదారులు, అతివేగం, ట్రాఫిక్ నిబంధనల అమలులో లోపాలు వంటి కారణాలతో ప్రతి సంవత్సరం వేలాది మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో ట్రక్, పికప్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో 18 మంది మరణించిన ఘటన దేశంలో కలకలం రేపింది.

రవాణాకు అంతరాయం ఉండొద్దు

- హార్మూజ్ భద్రత.. ప్రపంచ వాణిజ్యానికి కీలకం
- ఇరాన్ అధ్యక్షుడితో ఫోన్‌లో ప్రధాని మోదీ
- శ్చిమాసియా పరిస్థితులపై సమీక్ష
- శాంతి, దౌత్య పరిష్కారానికే మద్దతు పునరుద్ఘాటింపు

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిణామాల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో టెలిఫోన్‌లో మాట్లాడారు. ప్రాంతంలో కొనసాగుతున్న పరిస్థితులు, శాంతి చర్చల పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై ఇద్దరు నేతలు విస్తృతంగా చర్చించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) వెల్లడించింది. ఈ సందర్భంగా హోర్ముజ్ జలసంధిలో నౌకాయాన స్వేచ్ఛ భారత్‌తో పాటు ప్రపంచ వాణిజ్య వ్యవస్థకు అత్యంత కీలకమని ప్రధాని స్పష్టం చేశారు. అంతర్జాతీయ సముద్ర వాణిజ్యానికి ప్రధాన మార్గమైన హోర్ముజ్ జలసంధిలో రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. సముద్ర మార్గాల్లో వాణిజ్యం నిరాటంకంగా కొనసాగితేనే ప్రాంతీయ, ప్రపంచ ఆర్థిక స్థిరత్వం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇరాన్–అమెరికా మధ్య కొనసాగుతున్న చర్చల్లో నమోదైన పురోగతిని ప్రధాని మోదీ స్వాగతించారు. అన్ని వివాదాలకు సంభాషణ, దౌత్య మార్గాల ద్వారానే శాశ్వత పరిష్కారం లభిస్తుందన్న భారత్ వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో దీర్ఘకాలిక శాంతి, స్థిరత్వం నెలకొనేందుకు అన్ని పక్షాలు చర్చలను కొనసాగించాలని, శాంతి ప్రక్రియకు సహకరించాలని సూచించారు.

పశ్చిమాసియా పరిణామాలపై ఇరాన్ వివరణ

పశ్చిమాసియాలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు, శాంతి చర్చల ప్రస్తుత స్థితి, రాబోయే కార్యాచరణపై ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ ప్రధాని మోదీకి వివరించినట్లు పీఎంఓ తెలిపింది. ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గించి శాంతి నెలకొల్పేందుకు జరుగుతున్న ప్రయత్నాల గురించి కూడా ఆయన సమాచారం అందించినట్లు పేర్కొంది.

ఎక్స్‌లో ప్రధాని వ్యాఖ్యలు

సంభాషణ అనంతరం ప్రధాని మోదీ ఎక్స్‌లో స్పందిస్తూ.. పశ్చిమాసియా పరిస్థితులపై ఇరాన్ అధ్యక్షుడితో సమగ్రంగా చర్చించినట్లు వెల్లడించారు. చర్చల్లో సాధించిన పురోగతిని స్వాగతిస్తూ, కొనసాగుతున్న శాంతి ప్రయత్నాలు ప్రాంతంలో శాశ్వత స్థిరత్వానికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. హోర్ముజ్ జలసంధిలో నౌకాయాన స్వేచ్ఛ భారత్‌కే కాకుండా ప్రపంచ దేశాల ఆర్థిక ప్రయోజనాలకు కూడా అత్యంత కీలకమని మరోసారి పునరుద్ఘాటించారు.

ఖమేనీ అంత్యక్రియలకు భారత ప్రతినిధులు

ఇరాన్ మాజీ సర్వోన్నత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరు కావాలని ఇరాన్ అధ్యక్షుడు ప్రధాని మోదీని ఆహ్వానించిన విషయం తెలిసిందే. జూలై 5 నుంచి 9 వరకు నిర్వహించనున్న అంత్యక్రియలకు భారత ప్రతినిధులుగా బిహార్ గవర్నర్ ఆటా హస్నైన్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి పవిత్ర మార్గెరిటాను పంపాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. భారత్–ఇరాన్ ద్వైపాక్షిక సంబంధాలకు ప్రాధాన్యం ఇస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

లాహోర్‌లో ఘోర విషాదం

- ట్యూషన్ సెంటర్ పైకప్పు కూలి 14మంది చిన్నారుల మృతి
- 20 మంది విద్యార్థులు, ఓ మహిళా ఉపాధ్యాయురాలికి గాయాలు
- కాంట్రాక్టర్, ఇంటి యజమాని అరెస్ట్

లాహోర్: పాకిస్థాన్‌లోని లాహోర్‌లో మంగళవారం ఘోర విషాదం చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో నిర్వహిస్తున్న ప్రైవేట్ ట్యూషన్ సెంటర్ పైకప్పు అకస్మాత్తుగా కూలిపోవడంతో 14 మంది చిన్నారులు మృతి చెందగా, మరో 20 మంది విద్యార్థులతో పాటు ఓ మహిళా ఉపాధ్యాయురాలు గాయపడ్డారు. ఈ ఘటన నగరంలోని జనసాంద్రత అధికంగా ఉన్న కహ్నా నౌ ప్రాంతంలో జరిగింది. ఏడు నుంచి 13 ఏళ్ల మధ్య వయస్సు గల 30మందికి పైగా చిన్నారులు తరగతులు వింటున్న సమయంలో పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో విద్యార్థులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ బృందాలు, ఎధీ ఫౌండేషన్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి శిథిలాల నుంచి చిన్నారులను బయటకు తీశారు. ఇప్పటివరకు 14 మంది చిన్నారుల మృతదేహాలను వెలికితీశామని లాహోర్ డీఐజీ (ఆపరేషన్స్) ఫైసల్ కమ్రాన్ తెలిపారు.

ఏడుగురు బాలికలు, ఏడుగురు బాలురు

మృతుల్లో ఏడుగురు బాలికలు, ఏడుగురు బాలురు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. గాయపడిన 20 మంది చిన్నారులు, మహిళా ఉపాధ్యాయురాలిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ట్యూషన్ సెంటర్ నడుస్తున్న భవనంలో ఒక భాగంలో నిర్మాణ పనులు కొనసాగుతుండగా కార్మికులు పనిచేస్తున్న సమయంలోనే పైకప్పు కూలిపోయినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఘటనకు బాధ్యుడిగా భావిస్తున్న కాంట్రాక్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం దర్యాప్తులో భాగంగా ఇంటి యజమానిని కూడా అదుపులోకి తీసుకున్నారు.

విచారణకు ఆదేశాలు

పంజాబ్ ముఖ్యమంత్రి మేర్యం నవాజ్ ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి బాధ్యులెవరో గుర్తించి వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని పోలీసు, జిల్లా అధికారులను ఆదేశించారు. ఒక తల్లిగా తల్లిదండ్రుల బాధను నేను అర్థం చేసుకోగలను. ఈ విషాదాన్ని వర్ణించడానికి మాటలు రావడం లేదు అని ఆమె పేర్కొన్నారు. ఈ ఘటనపై పాకిస్థాన్ రాష్ట్రపతి ఆసిఫ్ అలీ జర్దారి చిన్నారుల మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా సమర్థవంతమైన భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యసేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.

భద్రతా ప్రమాణాల నిర్లక్ష్యమే కారణం

పాకిస్థాన్‌లో నాసిరకం నిర్మాణ సామగ్రి వినియోగం, భద్రతా ప్రమాణాల అమలులో నిర్లక్ష్యం కారణంగా ఇలాంటి భవన ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. గత ఏడాది జూలైలో కరాచీలోని లియారీ ప్రాంతంలో ఐదు అంతస్తుల భవనం కూలిపోవడంతో 27 మంది మృతి చెందగా, మరో 10 మంది గాయపడిన విషయం తెలిసిందే.

డీఎంకే ప్రక్షాళనకు స్టాలిన్ శ్రీకారం

- పార్టీ పునర్వ్యవస్థీకరణకు 10 మందితో కూడిన సలహా కమిటీ
- శాఖ స్థాయి నుంచి అగ్ర నాయకత్వం వరకు నిర్మాణాత్మక మార్పులకు కసరత్తు
- ఆగస్టు తొలి వారంలో నివేదిక సమర్పించాలని కమిటీకి ఆదేశం
- ఎన్నికల ఓటమి అనంతరం కార్యకర్తల అభిప్రాయాలు, ఏఐ విశ్లేషణ ఆధారంగా నిర్ణయం

చెన్నై: తమిళనాడులో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాజయం నేపథ్యంలో ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్ పార్టీ పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టారు. పార్టీ నిర్మాణంలో శాఖ స్థాయి నుంచి అత్యున్నత కమిటీల వరకు సమగ్ర మార్పులు సూచించేందుకు 10 మంది సభ్యులతో కూడిన పార్టీ పునర్వ్యవస్థీకరణ సలహా కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆగస్టు తొలి వారంలో తన సిఫార్సులను సమర్పించనుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాజయం తర్వాత పార్టీ పరిస్థితిని అంచనా వేసేందుకు గతంలో 38 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిన విషయాన్ని స్టాలిన్ గుర్తుచేశారు. ఆ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తలను కలిసి సేకరించిన నివేదికలను తాను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

ఆరు లక్షల అభిప్రాయాలకు ఏఐ విశ్లేషణ

ఉడన్‌పిరప్పిన్ కురల్ పేరుతో ఆన్‌లైన్‌లో కార్యకర్తల నుంచి అభిప్రాయాలను కూడా సేకరించినట్లు స్టాలిన్ తెలిపారు. దాదాపు ఆరు లక్షల అభిప్రాయాలు అందాయని, వాటిని కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో విశ్లేషించి ప్రత్యేక నివేదిక రూపొందించామని చెప్పారు. పార్టీని కాలానుగుణంగా మార్చాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం విస్తృతంగా వ్యక్తమైందని వెల్లడించారు.

శాఖల నుంచి అగ్రస్థాయి వరకు మార్పులు

గత లోపాలను సరిదిద్దుకుని ప్రజలకు కొత్త రూపంలో చేరువ కావాలంటే పార్టీ పునర్వ్యవస్థీకరణ తప్పనిసరి అని స్టాలిన్ పేర్కొన్నారు. శాఖ కమిటీల నుంచి రాష్ట్ర స్థాయి అగ్ర కమిటీల వరకు సంస్థాగత మార్పులు చేపట్టాలని, పార్టీ జిల్లాల పునర్విభజన, అనుబంధ విభాగాల పునర్నిర్మాణం వంటి అంశాలపై కమిటీ సిఫార్సులు చేయనుందని తెలిపారు.

థింక్ ట్యాంక్ ఏర్పాటుపైనా సూచనలు

ఎన్నికల నిర్వహణ కోసం శాశ్వత వ్యవస్థ ఏర్పాటు, ఎన్నికల కమిటీ పునర్వ్యవస్థీకరణతో పాటు పార్టీ నాయకత్వానికి వ్యూహాత్మక సూచనలు చేసే థింక్ ట్యాంక్ ఏర్పాటు అవసరంపై కూడా కమిటీ సిఫార్సులు చేయనుంది. అనంతరం పార్టీ అత్యున్నత కమిటీలు, జిల్లా కార్యదర్శులతో చర్చించి మార్పులను అమలు చేస్తామని స్టాలిన్ స్పష్టం చేశారు.

కమిటీలో ప్రముఖ నేతలు

ఈ కమిటీలో తంగం తెన్నరసు, గీతా జీవన్, ఆర్. సక్కరపాణి, ఎస్.ఎస్. శివశంకర్‌తో పాటు తమిళరసి రవికుమార్, ఎం.ఎం. అబ్దుల్లా, ఐ. పరంతమన్, ఎస్. మురసొలి, ఎం.పీ. ఎజిలన్, ఎస్‌కేపీ కరుణ సభ్యులుగా ఉన్నారు.

పరాజయం తర్వాత కీలక నిర్ణయం

ఈ ఏడాది ఏప్రిల్ 23న జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని టీవీకే 108 స్థానాలు గెలిచి అధికారంలోకి రాగా, అధికార డీఎంకే కేవలం 59 స్థానాలకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో పార్టీని మళ్లీ బలోపేతం చేసి భవిష్యత్ ఎన్నికలకు సిద్ధం చేయాలనే లక్ష్యంతో స్టాలిన్ ఈ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను ప్రారంభించారు.

తృణమూల్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ

- పార్టీ బ్యాంక్ ఖాతాల ఫ్రీజ్‌పై అత్యవసర విచారణకు నో

కోల్‌కతా : తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ బ్యాంక్ ఖాతాల ఫ్రీజింగ్‌ను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలన్న టీఎంసీ విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించింది. టీఎంసీ బ్యాంక్ ఖాతాల నిలిపివేత కారణంగా పార్టీ కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని, తక్షణ విచారణ అవసరమని ఆ పార్టీ తరఫు న్యాయవాదులు న్యాయస్థానాన్ని కోరారు. అయితే ఈ అంశంలో ఎలాంటి అత్యవసర పరిస్థితి కనిపించడం లేదని పేర్కొంటూ కోల్‌కతా హైకోర్టు వెంటనే విచారణ చేపట్టేందుకు నిరాకరించింది. ఈ సును విచారించిన జస్టిస్ అమృతా సిన్హా సాధారణ లిస్టింగ్ పక్రియ ప్రకారమే పిటిషన్ విచారణ జరుగుతుందని స్పష్టం చేశారు. ంద్ర దర్యాప్తు సంస్థల చర్యల నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలు బ్యాంక్ ఖాతాలు స్తంభించిపోయాయి. ఖాతాలు ఫ్రీజ్ చేయడం వల్ల ఆ పార్టీ రోజువారీ కార్యకలాపాలు, ఉద్యోగుల చెల్లింపులు, సంస్థాగత వ్యయాలు, రాజకీయ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన నిధుల వినియోగంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని టీఎంసీ న్యాయవాదులు వాదించారు. అయితే హైకోర్టు తక్షణ ఉపశమనం ఇవ్వడానికి నిరాకరించడంతో టీఎంసీ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సు విచారణకు వచ్చే వరకు ఆ పార్టీ నేతలు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దిలా ఉండగా, కోల్‌కతా హైకోర్టు నిర్ణయం నేపథ్యంలో తదుపరి న్యాయపరమైన అవకాశాలను పరిశీలిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ నాయకత్వం, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశంపై ఆలోచిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారం పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సు రెగ్యులర్ విచారణలో కోర్టు ఎలాంటి నిర్ణయం

అంటార్కిటాలో పేలిన అగ్నిపర్వతం

బంగారం ధూళిని వెదజల్లిన లావా

అంటార్కిటికా : సాధారణంగా అగ్నిపర్వతాలు లావా, బూడిద, విషవాయువులను వెదజల్లడం సాధారణమే. కానీ అంటార్కిటికాలోని మౌంట్ ఎరెబస్ అగ్నిపర్వతం మాత్రం బంగారాన్ని డా గాల్లోకి వెదజల్లుతోంది. మన భూమండలానికి పూర్తిగా దక్షిణ ప్రాంతంలో ఉన్న ఈ అగ్నిపర్వతం ప్రతిరోజూ సుమారు 80 గ్రాముల బంగారు ధూళిని వాతావరణంలోకి విడుదల చేస్తోందని శాస్త్రవేత్తలు ఎప్పుడో గుర్తించారు. దీని విలువ రోజుకు సుమారు 6,000 డాలర్లు (దాదాపు 5.67 లక్షలు). అంటే ఏడాదికి దాదాపు 22 లక్షల డాలర్లు (రూ.18.9 కోట్లకు పైగా) ఉంటుందని అంచనా. మౌంట్ ఎరెబస్ నుంచి వెలువడే బంగారం ఆవిరి రూపంలో ఉంటుంది. అగ్నిపర్వతం నుంచి సుమారు 1,000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో బయటకు వచ్చే ఈ వేడి ఆవిరి అంటార్కిటికాలోని తీవ్రమైన చలిని తాకగానే చల్లబడి సూక్ష్మ బంగారు కణాలుగా మారిపోతుంది. ఈ కణాల పరిమాణం అత్యంత చిన్నదిగా ఉంటుంది. దీంతో అవి గాలిలో తేలుతూ దాదాపు వెయ్యి కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తున్నాయి. ఇవి చాలా సూక్ష్మ కణాలు కావడంతో వాటిని సేకరించడం లేదా వాణిజ్యపరంగా వినియోగించడం సాధ్యం కాదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు భౌగోళిక దక్షిణ ధ్రువానికి సుమారు 1,350 కిలోమీటర్ల దూరంలో, రాస్ ద్వీపంలో ఉన్న ఈ ఎరెబస్ పర్వతం నుంచి బంగారు కణాలు పైకి వస్తున్నట్టు 1991లోనే శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే బంగారం చాలా సూక్ష్మ ధూళి రూపంలో ఉండటం, అంటార్కిటికాలోని తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగా దానిని సేకరించడం వీలు కాదు. అంతేకాదు, ఎరెబస్ పర్వతం అంత సూక్ష్మ బంగారు స్ఫటికాలను ఎలా సృష్టించి, విడుదల చేస్తుందో డా శాస్త్రవేత్తలకు ఇప్పటికీ తెలియదు.

స్కూలు బస్సుపై కూలిన చెట్టు

- 11 ఏళ్ల బాలుడు మృతి..
- పలువురికి గాయాలు

ముంబై : ముంబై నగరంలో విషాదం చోటుచేసుకుంది. ఓ పెద్ద చెట్టు స్కూల్ బస్సుపై కూలిపడిన ఘటనలో ఓ బాలుడు మృతి చెందాడు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం మధ్యాహ్నం ఓ స్కూల్ బస్సు చెంబూర్ రోడ్ నంబర్ 11లో వెళుతుండగా పెద్ద చెట్టు కూలి బస్సుపై పడింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 13 మంది విద్యార్థులు ఉన్నారు. చెట్టు బస్సుపై పడగానే బస్ కండక్టర్, స్థానికులు వేగంగా స్పందించారు. ధ్వంసమైన బస్సు నుంచి పిల్లలను బయటకు తీసుకువచ్చారు. గాయపడ్డ ఐదుగురిని చెన్ ఆస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలోనే పోలీసులకు సమాచారం వెళ్లింది. పోలీసులు సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు మొదలెట్టారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ 11 ఏళ్ల విహాన్ శ్రీవాస్తవ్ అనే బాలుడు జెన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. మిగిలిన ఐదుగురి పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఘటన గురించి తెలియగానే ముంబై మేయర్ రీతూ తావ్‌డే జెన్ ఆస్పత్రికి వెళ్లారు. బాధితులను, వారి కుటుంబసభ్యులను పరామర్శిం చారు. ఈ సందర్భంగా రీతూ తావ్‌డే మాట్లాడుతూ.. 'ఈ సంఘటన ఎంతో బాధాకరం. నేనో తల్లిగా ఇక్కడికి వచ్చాను. పిల్లల తల్లిదండ్రులు శోకసంద్రం లో మునిగిపోయారు. ఆ స్కూల్ బస్సులో ప్రమాదం జరిగినపుడు 13 మంది ఉన్నారు. వారిలో 12 మంది క్షేమంగా బయటపడ్డారు. ఓ బాలుడు మృతి చెందాడు' అని తెలిపారు.

అరుణాచల్‌లో చైనా చొరబాట్లు

న్యూఢిల్లీ : చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్‌లో చొరబాట్లకు పాల్పడిందని, అక్కడ సైనిక శిబిరాలను ఏర్పాటు చేసిందని కొన్ని కథనాలు ప్రచారం కావడంతో, వాటిని భారత సైన్యం తోసిపుచ్చింది. ఆ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. అదంతా ఎలాంటి ఆధారం లేకుండా జరుగుతోన్న అసత్య ప్రచారమని వెల్లడించింది. మీడియా కథనాల ప్రకారం.. అరుణాచల్ ప్రదేశ్‌లోని తక్సింగ్ ప్రాంతంలోని నాహ్ ట్రైబల్ గ్రూప్‌నకు చెందిన నాహ్ వెల్ఫేర్ సొసైటీ .. ప్రభుత్వ అధికారులకు గతంలో ఒక వినతి ప్రతాన్ని సమర్పించింది. భారత్–చైనా సరిహద్దు సమీపంలో పీఎల్‌ఏ శిబిరాలను ఏర్పాటు చేసిందని అందులో ఆరోపించింది. గత 10– 15 సంవత్సరాలుగా చైనా సైనికులు తక్సింగ్ సరిహద్దు వెంట చొరబాట్లను క్రమంగా విస్తరిస్తున్నారని పేర్కొంది. వేట, పశువుల మేత, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం స్థానికులు ఉపయోగించే ప్రదేశాల్లో రోడ్లు, వంతెనలు, సైనిక శిబిరాలను నిర్మించారని ఆరోపించింది. ఆ ప్రాంతాల పేర్లను ప్రస్తావించింది. భారత సరిహద్దు ప్రాంతాల్లో చైనా కార్యకలాపాలు మరింత విస్తరించకుండా నిరోధించేలా రాష్ట్ర, ంద్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ వినతి పత్రాన్నే మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆర్మీ స్పందన వచ్చింది. ఇటీవల బీజింగ్‌లో భారత్–చైనా సరిహద్దు వ్యవహారాలకు సంబంధించిన సమావేశం జరిగింది. రెండు దేశాల మధ్య నిర్మాణాత్మక చర్చలు జరిగాయని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే మీడియా కథనాలు రావడం గమనార్హం.

ట్రంప్‌కు సుప్రీంలో చుక్కెదురు

న్యూయార్క్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అమెరికా సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. బర్త్‌రైట్ సిటిజన్‌షిప్‌ను అమెరికా సుప్రీంకోర్టు సమర్థించింది. అమెరికాలో అక్రమంగా లేదా తాత్కాలిక ప్రాతిపదికన నివసిస్తున్న తల్లిదండ్రులకు పుట్టే పిల్లలకు పౌరసత్వాన్ని నిరాకరిస్తూ ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వులను సుప్రీంకోర్టు కొట్టివేసింది. అమెరికా గడ్డపై జన్మించిన దాదాపు ప్రతి ఒక్కరికీ అమెరికన్ పౌరసత్వ హక్కును కొనసాగించేలా 6–3 మెజారిటీతో తీర్పు వెలువరిం చింది. అంతకుముందు, పౌరసత్వంపై ట్రంప్ విధించిన ఈ పరిమితులను అమెరికాలోని పలు కిందిస్థాయి కోర్టులు కొట్టేశాయి. ట్రంప్ ఉత్తర్వుల అమలును నిలిపివేశాయి. వీటిని సవాలు చేస్తూ అధ్యక్షుడు ట్రంప్ సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. గత కొన్ని నెలల నుంచి సుప్రీంకోర్టులో ఈ పిటిషన్‌పై విచారణ జరుగుతోంది.

వైభవ్‌కు అవకాశం దక్కేనా?

- నేడు ఇంగ్లండ్‌తో తొలి టీ20 • సూర్యవంశీ అరంగేట్రంపైనే అందరి దృష్టి
- ఐర్లాండ్‌తో సిరీస్ ఓటమి తర్వాత కీలక పోరుకు సిద్ధమైన టీమిండియా

చెస్టర్ లీ స్ట్రీట్ (యూకే): ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 అంతర్జాతీయ సిరీస్‌లో శుభారంభం చేయాలనే లక్ష్యంతో భారత జట్టు బుధవారం తొలి మ్యాచ్‌కు సిద్ధమైంది. అయితే ఈ మ్యాచ్‌లో అందరి దృష్టి 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం చేస్తాడా లేదా అన్న అంశంపైనే కేంద్రీకృతమైంది. ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ వైట్‌వాష్‌కు గురికావడంతో జట్టులో మార్పులు ఉంటాయన్న చర్చ జోరుగా సాగుతోంది. భారత సహాయ కోచ్ ర్యాన్ టెన్ డూషెట్ సూర్యవంశీ కూడా ఇతర ఆటగాళ్ల మాదిరిగానే అవకాశాల కోసం తన వంతు సమయం ఎదురుచూడాల్సి ఉంటుందని చెప్పినా, అంతర్జాతీయ క్రికెట్‌కు అతను సిద్ధంగా ఉన్నాడని స్పష్టం చేశారు. ఐర్లాండ్ సిరీస్‌లో ఓపెనర్ సంజూ శాంసన్ వరుసగా విఫలమవడం, ఇషాన్ కిషన్ కూడా ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో సూర్యవంశీకి తుది జట్టులో చోటు కల్పించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

బ్యాటింగ్ వైఫల్యంపై ఆందోళన

ఐర్లాండ్‌లో వేగ బౌలర్లకు అనుకూలమైన పిచ్‌లపై భారత బ్యాటర్లు తీవ్రంగా తడబడ్డారు. పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్‌ను మార్చుకోవడంలో విఫలమయ్యారు. రెండో టీ20లో తిలక్ వర్మ ఓపికగా అర్ధశతకం సాధించినప్పటికీ, మిగతా బ్యాటర్లు ఒత్తిడిని తట్టుకోలేక వికెట్లు కోల్పోయారు. ఐపీఎల్‌లో కనిపించిన దూకుడు ఇలాంటి పరిస్థితుల్లో పనిచేయదని స్పష్టమైంది. ఇంగ్లండ్ బౌలింగ్ విభాగంలో జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్, సాకిబ్ మహ్మూద్, సోనీ బేకర్ వంటి వేగ బౌలర్లు ఉండగా, ఆదిల్ రషీద్, రెహాన్ అహ్మద్ స్పిన్ విభాగాన్ని బలోపేతం చేస్తున్నారు. ఈ మైదానంలో ఇప్పటివరకు జరిగిన ఎనిమిది టీ20ల్లో సగటు స్కోరు కేవలం 138 మాత్రమే ఉండడం బౌలర్ల ఆధిపత్యాన్ని సూచిస్తోంది. భారత బ్యాటర్లు త్వరగా పరిస్థితులకు అలవాటు పడకపోతే కష్టమే.

బౌలర్లపై పెరిగిన బాధ్యత

ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో భారత బౌలర్లు ఆరంభంలో ఆధిపత్యం చెలాయించినా, మధ్య ఓవర్లలో పట్టు కోల్పోయారు. అదే తప్పిదం ఇంగ్లండ్‌లాంటి శక్తివంతమైన బ్యాటింగ్ లైనప్‌పై పునరావృతమైతే భారీ మూల్యం చెల్లించాల్సి రావచ్చు. ముఖ్యంగా అక్షర్ పటేల్, సూర్యాంశ్ షెడ్గే, వాషింగ్టన్ సుందర్ వంటి స్పిన్నర్లు మెరుగైన ప్రదర్శన చేయాల్సిన అవసరం ఉంది. ఆతిథ్య జట్టుకు కెప్టెన్ హ్యారీ బ్రూక్‌తో పాటు జోస్ బట్లర్, ఫిల్ సాల్ట్, జాకబ్ బెతెల్, టామ్ బాంటన్, విల్ జాక్స్, సామ్ కరన్ వంటి విధ్వంసక బ్యాటర్లు ఉన్నారు. దీంతో భారత బౌలర్లకు కఠిన పరీక్ష ఎదురుకానుంది.

భారత్ జట్టు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శివమ్ దూబే, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, సూర్యాంశ్ షెడ్గే, ప్రిన్స్ యాదవ్.

ఫైనల్‌కు ఆస్ట్రేలియా!

- మహిళల టీ20 ప్రపంచకప్‌లో వరుస ఆధిపత్యం
- వెస్టిండీస్‌పై 8 వికెట్ల ఘన విజయం

లండన్: మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. మంగళవారం ది ఓవల్ వేదికగా జరిగిన తొలి సెమీఫైనల్లో వెస్టిండీస్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ప్రపంచకప్ చరిత్రలో ఆస్ట్రేలియాకు ఇది ఎనిమిదో ఫైనల్ కాగా, ఏడో టైటిల్‌ను సొంతం చేసుకునేందుకు మరో అడుగు దూరంలో నిలిచింది. ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 125 పరుగులు మాత్రమే చేసింది. ఆస్ట్రేలియా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో వెస్టిండీస్ బ్యాటర్లు భారీ స్కోరు నమోదు చేయలేకపోయారు.

మూనీ–గార్డ్నర్ మెరుపులు

126 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 13 ఓవర్లకే 2 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఓపెనర్ బెత్ మూనీ 36 బంతుల్లో 61 పరుగులతో అజేయంగా నిలవగా, యాష్ గార్డ్నర్ 20 బంతుల్లో 35 పరుగులు చేసి జట్టును సునాయాస విజయతీరాలకు చేర్చింది. వీరిద్దరూ మూడో వికెట్‌కు అజేయంగా 37 బంతుల్లో 63 పరుగులు జోడించి మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేశారు.

రికార్డు ఫైనల్.. టైటిల్‌పై గురి

ఈ ఇన్నింగ్స్‌తో బెత్ మూనీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో తన ఎనిమిదో అర్ధశతకాన్ని నమోదు చేసింది. ఈ ఘనతలో ఆమె న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ సూజీ బేట్స్ రికార్డును సమం చేసింది. ఆదివారం లార్డ్స్‌లో జరిగే ఫైనల్లో ఆస్ట్రేలియా ఆతిథ్య ఇంగ్లండ్–దక్షిణాఫ్రికా మధ్య గురువారం జరిగే రెండో సెమీఫైనల్ విజేతతో తలపడనుంది.

ఆర్‌సీబీపై ఆదిత్య బిర్లా గ్రూప్ పట్టు

- రూ.16,660 కోట్ల కొనుగోలుకు సీసీఐ ఆమోదం
- కన్సార్టియానికి గ్రీన్‌సిగ్నల్
- రాయల్ ఛాలెంజర్స్ స్పోర్ట్స్‌లో 100 శాతం వాటాల బదిలీకి మార్గం సుగమం

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో అత్యంత విలువైన ఫ్రాంచైజీల్లో ఒకటైన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) యాజమాన్య మార్పునకు పోటీ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం లభించింది. రూ.16,660 కోట్ల నగదు ఒప్పందం ద్వారా ఆర్‌సీబీని కొనుగోలు చేస్తున్న ఆదిత్య బిర్లా గ్రూప్ నేతృత్వంలోని కన్సార్టియానికి సీసీఐ మంగళవారం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో యాజమాన్య బదిలీ ప్రక్రియ పూర్తయ్యేందుకు కీలక అడ్డంకి తొలగినట్లయింది. ఆర్‌సీబీ యాజమాన్య సంస్థ అయిన రాయల్ ఛాలెంజర్స్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్‌సీఎస్‌పీఎల్)లోని 100 శాతం వాటాలను బిగ్ బనియన్ హోల్డింగ్స్, బోల్ట్ ఐపీఎల్ హోల్డింగ్స్, టైమ్స్ ఇంటర్నెట్ లిమిటెడ్, టైమ్స్ క్రికెట్ ఎల్‌ఎల్‌పీ, ఐసీక్యూ అపర్చునిటీస్ ఆర్‌సీ హోల్డ్‌కో లిమిటెడ్, ఆసియా ఇన్వెస్ట్‌మెంట్ టాప్‌కో–II పీటీఈ లిమిటెడ్‌తో పాటు ఇతర పెట్టుబడిదారులు సంయుక్తంగా కొనుగోలు చేయనున్న ప్రతిపాదనకు అనుమతి ఇచ్చినట్లు సీసీఐ వెల్లడించింది.

కీలక భాగస్వాములుగా దిగ్గజ సంస్థలు

కన్సార్టియంలో కీలక భాగస్వామిగా ఉన్న బిగ్ బనియన్ హోల్డింగ్స్ ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన సంస్థ. ఆసియా ఇన్వెస్ట్‌మెంట్ టాప్‌కో–IIపై ప్రపంచ ప్రఖ్యాత ప్రైవేట్ ఈక్విటీ సంస్థ బ్లాక్‌స్టోన్ అనుబంధ నిధుల నియంత్రణ ఉంది. ఐసీక్యూ అపర్చునిటీస్ ప్రపంచ పెట్టుబడి సంస్థ ఐకానిక్ గ్రూప్‌లో భాగం. టైమ్స్ ఇంటర్నెట్ డిజిటల్ మీడియా, ప్రకటనలు, ఈవెంట్లు, రివార్డ్స్ తదితర రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, బోల్ట్ వెంచర్స్ ప్రముఖ క్రీడా పెట్టుబడిదారు డేవిడ్ బ్లిట్జర్‌కు చెందిన ప్రైవేట్ పెట్టుబడి వేదికగా ఉంది. ఈ ఏడాది మార్చిలో యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ (యూఎస్‌ఎల్) ఆర్‌సీబీ ఫ్రాంచైజీని రూ.16,660 కోట్ల నగదు ఒప్పందంలో ఈ కన్సార్టియానికి విక్రయిస్తున్నట్లు ప్రకటించింది. అంతకుముందు 2025 నవంబర్‌లో ఆర్‌సీబీలోని తన పెట్టుబడులపై వ్యూహాత్మక సమీక్ష చేపడుతున్నట్లు యూఎస్‌ఎల్ వెల్లడించింది. రాయల్ ఛాలెంజర్స్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఐపీఎల్‌లో పురుషుల జట్టుతో పాటు మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో మహిళల జట్టును కూడా నిర్వహిస్తోంది. ఈ సంస్థ కార్యకలాపాలు పూర్తిగా దేశానికే పరిమితమై ఉన్నాయి. 2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పుడు వ్యాపారవేత్త విజయ్ మల్యా ఆర్‌సీబీని స్థాపించారు. అనంతరం ఆయనకు చెందిన మద్యం వ్యాపార సంస్థ యునైటెడ్ స్పిరిట్స్‌ను డియాజియో స్వాధీనం చేసుకోవడంతో ఆర్‌సీబీ యాజమాన్యం కూడా డియాజియో గ్రూప్ పరిధిలోకి వెళ్లింది. ఇప్పుడు తాజా ఒప్పందంతో ఆ ఫ్రాంచైజీ ఆదిత్య బిర్లా గ్రూప్ నేతృత్వంలోని కన్సార్టియం చేతుల్లోకి వెళ్లనుంది.

Business
బిజినెస్

ఉబెర్‌లో కొత్త భద్రతా ఫీచర్లు

- రికార్డ్ మై రైడ్, అత్యవసర అంబులెన్స్ సేవలు అందుబాటులోకి
- భద్రతపై అనుమానం కలిగితే యాప్‌లోనే వీడియో రికార్డింగ్
- తక్షణ వైద్య సహాయం కోసం డయల్ 4242తో భాగస్వామ్యం

న్యూఢిల్లీ: ప్రయాణికులు, డ్రైవర్ల భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా ప్రముఖ క్యాబ్ సేవల సంస్థ ఉబెర్ మరో అడుగు వేసింది. ప్రయాణ సమయంలో భద్రతా సమస్యలు తలెత్తినప్పుడు ఉపయోగపడే రికార్డ్ మై రైడ్ ఫీచర్‌తో పాటు, ప్రమాదాల సమయంలో తక్షణ వైద్య సహాయం అందించేందుకు అంబులెన్స్ అసిస్టెన్స్ సేవను మంగళవారం ప్రారంభించింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రయాణాలను మరింత సురక్షితంగా మార్చడమే ఈ కొత్త సేవల ప్రధాన ఉద్దేశమని సంస్థ తెలిపింది. రికార్డ్ మై రైడ్ ఫీచర్ ద్వారా డ్రైవర్లు ప్రయాణ సమయంలో అసురక్షితంగా భావిస్తే, తమ మొబైల్ ఫోన్‌ను ఉపయోగించి ఉబెర్ యాప్‌లోనే క్యాబ్‌లో జరిగే పరిణామాలను వీడియోగా రికార్డు చేసుకోవచ్చు. ఈ వీడియోలు పూర్తిగా ఎన్‌క్రిప్ట్ చేయబడతాయని, డ్రైవర్‌కైనా, ఉబెర్‌కైనా వాటిని నేరుగా చూసే అవకాశం ఉండదని సంస్థ స్పష్టం చేసింది. రికార్డ్ చేసిన వీడియోలు సంబంధిత చట్టాలకు అనుగుణంగా సురక్షితంగా భద్రపరచబడతాయని ఉబెర్ వెల్లడించింది. డ్రైవర్ భద్రతా ఫిర్యాదు నమోదు చేసినప్పుడు మాత్రమే ఆ వీడియోలను ఆధారాలుగా సమర్పించుకునే అవకాశం ఉంటుందని, మిగతా సందర్భాల్లో అవి ఎవరికీ అందుబాటులో ఉండవని తెలిపింది. దీంతో వినియోగదారుల గోప్యతకు పూర్తి రక్షణ ఉంటుందని పేర్కొంది. ఇక ప్రయాణంలో ప్రమాదం జరిగినప్పుడు ప్రయాణికులు, డ్రైవర్లు వెంటనే అంబులెన్స్ సేవలు పొందేందుకు మెడికల్ లాజిస్టిక్స్ సంస్థ డయల్ 4242తో ఉబెర్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ సేవను ఉబెర్ యాప్‌లో ఇప్పటికే ఉన్న 24 గంటల సేఫ్టీ లైన్ ద్వారా వినియోగించుకోవచ్చు.

పెట్రోల్ ఎగుమతులపై పన్ను పెంపు

- ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం రూ.1.50 నుంచి రూ.4కు పెంపు • డీజిల్, ఏటీఎఫ్‌కు ఊరట
- నేటి నుంచి కొత్త విండ్‌ఫాల్ ట్యాక్స్ అమలు – మరిన్ని దేశాలకు మినహాయింపులు

న్యూఢిల్లీ: పెట్రోల్ ఎగుమతులపై విధిస్తున్న విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను (ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం–ఎస్‌ఏఈడీ) కేంద్ర ప్రభుత్వం పెంచింది. అదే సమయంలో డీజిల్, విమాన ఇంధనం (ఏటీఎఫ్) ఎగుమతులపై విధిస్తున్న సుంకాన్ని తగ్గించింది. సవరించిన పన్ను రేట్లు జూలై 1 నుంచి అమల్లోకి రానున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ మంగళవారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో వెల్లడించింది. తాజా నిర్ణయం ప్రకారం.. పెట్రోల్ ఎగుమతులపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని లీటర్‌కు రూ.1.50 నుంచి రూ.4కు పెంచారు. మరోవైపు డీజిల్‌పై లీటర్‌కు రూ.14గా ఉన్న సుంకాన్ని రూ.8.50కు, ఏటీఎఫ్‌పై రూ.12.50 నుంచి రూ.7.50కు తగ్గించారు. ఈ మార్పులు జూలై 1 నుంచి అమల్లోకి వస్తాయి. ఇదిలాఉంటే దేశీయ మార్కెట్‌కు సరఫరా చేసే పెట్రోల్, డీజిల్‌పై ప్రస్తుతం అమల్లో ఉన్న ఎక్సైజ్ సుంకాల్లో ఎలాంటి మార్పు లేదని కేంద్రం స్పష్టం చేసింది. తాజా సవరణలు ఎగుమతులపై మాత్రమే వర్తిస్తాయని పేర్కొంది.

15 రోజులకోసారి సమీక్ష

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల నేపథ్యంలో దేశీయంగా ఇంధన లభ్యతకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 27న డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను విధించింది. అనంతరం ప్రతి 15 రోజులకు ఒకసారి ఈ పన్ను రేట్లను సమీక్షిస్తోంది. అలాగే మే 16 నుంచి పెట్రోల్ ఎగుమతులపైనా ఈ సుంకాన్ని అమలు చేస్తోంది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, శ్రీలంకలకు చేసే పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులకు ఇప్పటికే ఉన్న సుంక మినహాయింపును ఇప్పుడు మారిషస్, మాల్దీవులకు కూడా విస్తరించింది. దీంతో ఈ దేశాలకు ప్రభుత్వ రంగ సంస్థలు చేసే ఎగుమతులపై విండ్‌ఫాల్ ట్యాక్స్ వర్తించదు.

ఎందుకీ విండ్‌ఫాల్ ట్యాక్స్?

పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగిన నేపథ్యంలో ఎగుమతుల ద్వారా చమురు కంపెనీలు అసాధారణ లాభాలు పొందకుండా నియంత్రించడం, దేశీయ మార్కెట్‌లో పెట్రోలియం ఉత్పత్తుల లభ్యతను కాపాడటం, ఇంధన సరఫరా వ్యవస్థను స్థిరంగా ఉంచడమే విండ్‌ఫాల్ ట్యాక్స్ విధానం ప్రధాన లక్ష్యమని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

విక్రమ్ సోలార్‌కు ఊరట

సౌర విద్యుత్ రంగంలోని ప్రముఖ సంస్థ విక్రమ్ సోలార్‌కు జాతీయ కంపెనీ న్యాయ అప్పీలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) కీలక ఊరట కల్పించింది. సంస్థపై కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియ (సీఐఆర్‌పీ) ప్రారంభించాలని జాతీయ కంపెనీ న్యాయ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఇచ్చిన ఉత్తర్వులను ఎన్‌సీఎల్ఏటీ రద్దు చేసింది. బకాయి ఉన్న ఆపరేషనల్ రుణం రూ.1 కోటి కనీస పరిమితి కంటే తక్కువగా ఉండటంతో దివాలా ప్రక్రియ ప్రారంభించడం చట్టబద్ధం కాదని స్పష్టం చేసింది. జస్టిస్ యోగేష్ ఖన్నా, సాంకేతిక సభ్యుడు నరేశ్ సలేచాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం, విక్రమ్ సోలార్ డిపాజిట్ చేసిన రూ.91,98,556ను తిరిగి చెల్లించాలని ఆదేశించింది. ఇదే మొత్తం ఆపరేషనల్ క్రెడిటర్ ఇసిత్వ స్టీల్స్ అంగీకరించిన బకాయి అని పేర్కొంది.

నష్టాల్లో మార్కెట్లు

- ఐటీ షేర్ల అమ్మకాలతో వరుసగా రెండో రోజూ డౌన్
- సెన్సెక్స్ 250 పాయింట్లు.. నిఫ్టీ 23,866 దిగువకు

ముంబై: దేశీయ ఈక్విటీ మార్కెట్లు వరుసగా రెండో రోజు నష్టాల్లో ముగిశాయి. ఐటీ, చమురు–గ్యాస్, బ్యాంకింగ్ రంగ షేర్లలో భారీ అమ్మకాలతో పాటు అమెరికా–ఇరాన్ మధ్య తదుపరి దౌత్య చర్చలపై కొనసాగుతున్న అనిశ్చితి, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, రుతుపవనాల మందగమనం వంటి అంశాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలహీనపరిచాయి. దీంతో మంగళవారం బీఎస్ఈ సెన్సెక్స్ 249.70 పాయింట్లు (0.33 శాతం) క్షీణించి 76,478.67 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 80.50 పాయింట్లు (0.34 శాతం) పడిపోయి 23,865.75 వద్ద ముగిశాయి. ఉదయం స్వల్ప లాభాలతో ప్రారంభమైన మార్కెట్లు ఆ తర్వాత అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 398.98 పాయింట్లు క్షీణించి 76,329.39 కనిష్ఠ స్థాయిని తాకింది. చివర్లో కొంత కొనుగోళ్లు నమోదైనా సూచీలు నష్టాల నుంచి పూర్తిగా కోలుకోలేకపోయాయి. అయితే మార్కెట్ పతనానికి ఐటీ రంగమే ప్రధాన కారణమైంది. ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా షేర్లు గణనీయంగా క్షీణించాయి. వీటితో పాటు ఐటీసీ, హిందుస్థాన్ యూనిలీవర్ కూడా నష్టాల్లో ముగిశాయి. మరోవైపు మారుతీ సుజుకి, టైటాన్, బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్ షేర్లు లాభపడ్డాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) సోమవారం రూ.1,350.10 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించడం మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 73.32 డాలర్లకు పెరగడం కూడా ఇన్వెస్టర్లను అప్రమత్తం చేసింది.

రుతుపవనాలపై ఆందోళన

నైరుతి రుతుపవనాల ఆలస్య ప్రారంభం, వర్షపాతం ఆశించిన స్థాయిలో లేకపోవడం కూడా మార్కెట్‌ను ప్రభావితం చేసింది. గత పదేళ్లలోనే అత్యల్ప వర్షపాతం నమోదయ్యే అవకాశాలపై విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది వ్యవసాయ ఉత్పత్తితో పాటు అనుబంధ రంగాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని, తొలి త్రైమాసిక (క్యూ1) కార్పొరేట్ ఫలితాలపై కూడా ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉన్నారని పేర్కొన్నారు. ఆయా రంగాల వారీగా చూస్తే బీఎస్ఈ ఫోకస్డ్ ఐటీ సూచీ 2.62 శాతం, ఐటీ సూచీ 2.48 శాతం చొప్పున క్షీణించాయి.

పీఎస్‌యూ బ్యాంకులు, బ్యాంకెక్స్, టాప్–10 బ్యాంకులు, మెటల్, యుటిలిటీస్, ప్రైవేట్ బ్యాంకింగ్ సూచీలు కూడా నష్టాల్లో ముగిశాయి. అయితే రియాల్టీ సూచీ 1.23 శాతం ఎగబాకి అత్యధిక లాభాన్ని నమోదు చేసింది. సర్వీసెస్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, కన్జ్యూమర్ డిస్క్రిషనరీ, హెల్త్‌కేర్, క్యాపిటల్ గూడ్స్, కమోడిటీస్ రంగాల్లో కొనుగోళ్లు కనిపించాయి. అలాగే బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 0.59 శాతం, మిడ్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 0.46 శాతం లాభపడ్డాయి.

ఇండిగోలో మరో కీలక మార్పు

- హెచ్‌ఆర్ చీఫ్ సుఖ్‌జిత్ సింగ్ పస్రిచా రాజీనామా
- సంస్థలో కొనసాగుతున్న సీనియర్ అధికారుల నిష్క్రమణ
- 20 నుంచి కొత్త హెచ్‌ఆర్ చీఫ్‌గా బక్షీ బాధ్యతలు

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగోలో మరో కీలకస్థాయి మార్పు చోటుచేసుకుంది. సంస్థ చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ (సీహెచ్‌ఆర్‌వో) సుఖ్‌జిత్ సింగ్ పస్రిచా తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను సంస్థ ఆమోదించగా, ప్రస్తుతం ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్‌లో గ్రూప్ హెడ్–హ్యూమన్ రిసోర్సెస్‌గా ఉన్న కన్వల్‌జీత్ సింగ్ బక్షీ కొత్త సీహెచ్‌ఆర్‌వోగా బాధ్యతలు చేపట్టనున్నట్లు ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. సుఖ్‌జిత్ సింగ్ పస్రిచా జూలై 19 వరకు విధుల్లో కొనసాగి, అనంతరం సంస్థ నుంచి అధికారికంగా తప్పుకోనున్నారు. ఆయన స్థానంలో కన్వల్‌జీత్ సింగ్ బక్షీ జూలై 20 నుంచి చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

వ్యక్తిగత లక్ష్యాల దిశగా నిర్ణయం

గత ఎనిమిదిన్నరేళ్లుగా ఇండిగోలో సేవలందిస్తున్న పస్రిచా, తన వృత్తిపరమైన ప్రయాణం, వ్యక్తిగత లక్ష్యాలపై సంస్థ యాజమాన్యంతో గత కొన్ని నెలలుగా చర్చించిన అనంతరం పదవి నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు జూన్ 2న సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ భాటియాకు రాజీనామా లేఖ సమర్పించారు. 2025 డిసెంబర్‌లో ఇండిగో కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడిన తర్వాత సంస్థలో వరుసగా సీనియర్ స్థాయి అధికారులు వైదొలుగుతున్నారు. ఈ ఏడాది మార్చిలో సీఈవో పీటర్ ఎల్బర్స్ పదవి నుంచి తప్పుకోగా, గ్లోబల్ సేల్స్ హెడ్ వినయ్ మల్హోత్రా వచ్చే నెలలో సంస్థను వీడనున్నారు. అంతకుముందే ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్ (ఓసీసీ) హెడ్ జాసన్ హీటర్ కూడా సంస్థను వీడారు. తాజా పరిణామంతో ఇండిగోలో కీలక స్థాయి మార్పులు కొనసాగుతున్నాయి.

బక్షీకి విస్తృత అనుభవం

కొత్త సీహెచ్‌ఆర్‌వోగా నియమితులైన కన్వల్‌జీత్ సింగ్ బక్షీకి మానవ వనరుల నిర్వహణలో సుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో ఇండిగోతో పాటు ఒబెరాయ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్, భారతి ఎయిర్‌టెల్, ఉషా ఇండియా, హెచ్‌ఎంటీ వంటి ప్రముఖ సంస్థల్లో కీలక నాయకత్వ బాధ్యతలు నిర్వహించారు. హెచ్‌ఆర్ వ్యూహాలు, సంస్థాగత అభివృద్ధి, ఉద్యోగుల నిర్వహణలో ఆయనకు విశేష అనుభవం ఉందని సంస్థ పేర్కొంది.

బాక్సాఫీస్ పోరుకు సిద్ధమైన బాలయ్య–ప్రభాస్

ఒకప్పుడు టాలీవుడ్‌లో నవంబర్, డిసెంబర్ నెలలను బ్యాడ్ సీజన్‌గా భావించేవారు. ఆ సమయంలో పెద్ద సినిమాల విడుదలకు నిర్మాతలు ఆసక్తి చూపేవారు కాదు. అయితే గత కొన్నేళ్లుగా పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ముఖ్యంగా డిసెంబరులో విడుదలైన భారీ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలు సాధించడంతో, ఇప్పుడు ఈ నెలపై చిత్ర నిర్మాతలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇదే క్రమంలో ఈ ఏడాది డిసెంబరులో ఇద్దరు స్టార్ హీరోలు బాక్సాఫీస్ పోరుకు సిద్ధమవుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వారిలో ఒకరు రెబెల్ స్టార్ ప్రభాస్ కాగా, మరొకరు గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ. ప్రభాస్, దర్శకుడు హను రాఘవపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా ‘ఫౌజీ’ చిత్రాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఏడాది డిసెంబరులో విడుదల చేయాలని చిత్రబృందం భావిస్తున్నట్లు సమాచారం. ఇందుకు డిసెంబర్ 3 తేదీ సరైన ఎంపికగా మేకర్స్ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు నందమూరి బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో రూపొందుతున్న క్రేజీ ప్రాజెక్ట్‌ను కూడా అదే నెలలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి ఈ చిత్రం దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉన్నప్పటికీ, షూటింగ్ ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తుండటంతో ప్రత్యామ్నాయంగా డిసెంబర్ 4 తేదీని పరిశీలిస్తున్నట్లు టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఒక రోజు వ్యవధిలో ప్రభాస్, బాలకృష్ణ సినిమాలు విడుదలయ్యే అవకాశముందన్న వార్తలతో ఈసారి డిసెంబర్ బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి.

యంగ్ హీరో అఖిల్ రాజ్‌పై వివాదం

‘రాజు వెడ్స్ రాంబాయి’ చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో అఖిల్ రాజ్ తాజాగా ఓ వివాదానికి కేంద్రబిందువయ్యాడు. ఫుడ్ డెలివరీ బాయ్‌తో ఆయన వాగ్వాదానికి దిగినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీనికి సంబంధించినట్లు చెబుతున్న ఒక వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుండగా, ఈ ఘటనపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అందుతున్న సమాచారం ప్రకారం, అఖిల్ రాజ్ ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ చేయగా పొరపాటున వేరే ఆర్డర్ డెలివరీ అయినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఇరువురి మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. వీడియోలో డెలివరీ బాయ్ తన తప్పును అంగీకరిస్తూ క్షమాపణలు చెప్పినట్లు కనిపిస్తుండగా, అదే సమయంలో అఖిల్ రాజ్ ఆగ్రహంతో స్పందించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. అలాగే అక్కడే ఉన్న కుటుంబ సభ్యులు వారిస్తున్నప్ప టికీ పరిస్థితి ఉద్రిక్తంగా మారినట్లు వీడియోలో కనిపిస్తున్నట్లు నెటిజన్లు చర్చించుకుంటున్నారు. మరోవైపు, తాను క్షమాపణలు చెప్పినా తన మాట వినలేదని బాధితుడు వీడియోలో ఆవేదన వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఘటనపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున స్పందనలు వస్తుండగా, అఖిల్ రాజ్ వైఖరిపై కొందరు విమర్శలు చేస్తున్నారు. అయితే వైరల్ అవుతున్న వీడియోపై లేదా ఈ వివాదంపై అఖిల్ రాజ్ నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.

పవన్ సరసన పూజా హెగ్డే?

బుట్టబొమ్మ పూజా హెగ్డే గత కొంతకాలంగా సరైన విజయాలు లేక టాలీవుడ్‌లో కొంత వెనుకబడిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఈ సుందరి ఓ భారీ అవకాశం దక్కించుకున్నట్లు ఫిలింనగర్ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించే సినిమాలో ఆమెకు హీరోయిన్‌గా అవకాశం వచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పవన్ కళ్యాణ్, టాలెంటెడ్ డైరెక్టర్ సుజిత్ కాంబినేషన్‌లో రూపొందిన ‘ఓజీ’ చిత్రానికి కొనసాగింపుగా ‘ఓజీ–2’ను ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో పూజా హెగ్డేను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గతంలో కూడా పవన్ కళ్యాణ్, పూజా హెగ్డే కాంబినేషన్ సెట్ అవుతుందని వార్తలు వచ్చాయి. హరీశ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘ఉస్తాద్ భగత్ సింగ్’ చిత్రంలో మొదట పూజా హెగ్డే పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే డేట్స్ సమస్యలతో పాటు ఇతర కారణాల వల్ల ఆ కాంబినేషన్ కార్యరూపం దాల్చలేదు. ఒకవేళ ఇప్పుడు ‘ఓజీ–2’లో పూజా హెగ్డే ఎంపిక వార్తలు నిజమైతే మాత్రం, అది ఆమె కెరీర్‌కు భారీ మలుపు కావొచ్చని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. వరుస పరాజయాల తర్వాత కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న పూజా హెగ్డేకు ఈ క్రేజీ ప్రాజెక్ట్ బలమైన కమ్‌బ్యాక్‌గా మారే అవకాశముందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందనేది అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

‘రామాయణ’ ట్రైలర్‌కు డేట్ ఫిక్స్?

ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమ నుంచి ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆసక్తి రేకెత్తిస్తున్న భారీ చిత్రాల్లో ‘రామాయణ’ ఒకటి. దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో రణబీర్ కపూర్, యష్, సాయి పల్లవి తదితర అగ్ర తారలు నటిస్తున్నారు. భారతీయ సినిమా చరిత్రలో తొలి ఐమాక్స్ ప్రెజెంటేషన్‌గా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మేకర్స్ నిర్మిస్తున్నారు. విజువల్స్ విషయంలో కొన్ని విమర్శలు వచ్చినప్పటికీ, సినిమా కంటెంట్‌పై మాత్రం ప్రేక్షకుల్లో అంచనాలు ఏమాత్రం తగ్గలేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, గత కొంతకాలంగా ఈ సినిమా ట్రైలర్‌కు సంబంధించిన వార్తలు వినిపిస్తున్నాయి. ట్రైలర్‌ను జూలైలో విడుదల చేసే అవకాశముందని ఇప్పటికే ప్రచారం జరిగింది. అయితే తాజా సమాచారం ప్రకారం, సినిమా విడుదలకు ఇంకా దాదాపు 100 రోజుల సమయం ఉండగానే జూలై 14న లాస్ ఏంజిల్స్‌లో ట్రైలర్‌ను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు బలమైన ప్రచారం జరుగుతోంది. సినిమా విడుదలకు ఇంకా చాలా సమయం ఉన్నప్పటికీ ఇంత ముందుగానే ట్రైలర్ విడుదలకు సిద్ధమవుతుండడం అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడాల్సి ఉంది. ఈ చిత్రానికి హాన్స్ జిమ్మర్, ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, సినిమా నవంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది.

కోలీవుడ్ పై జాన్వీ ఫోకస్!

బాలీవుడ్ స్టార్ కిడ్, దివంగత అతిలోక సుందరి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ దక్షిణాది సినిమా పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. టాలీవుడ్‌లో గ్లోబల్ స్టార్ ఎన్టీఆర్ సరసన ‘దేవర’ చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన ఈ భామ, అనంతరం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ – బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ‘పెద్ది’ చిత్రంలోనూ కథానాయికగా అవకాశం దక్కించుకుంది. భారీ ప్రాజెక్ట్‌లతో తెలుగులో తన స్థానాన్ని బలపరుచుకునే ప్రయత్నం చేస్తున్న జాన్వీ, ఇప్పుడు తమిళ చిత్ర పరిశ్రమలో కూడా అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అందుతున్న సమాచారం ప్రకారం, తమిళంలో జాన్వీ ఓ భారీ వెబ్ సిరీస్ ద్వారా డిజిటల్ ఎంట్రీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌కు ‘కురత్తి’ అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం. కోలీవుడ్ దర్శకుడు పా. రంజిత్‌కు చెందిన నిర్మాణ సంస్థ నీలం ప్రొడక్షన్స్ ఈ వెబ్ సిరీస్‌ను నిర్మించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. సామాజిక అంశాలు, అట్టడుగు వర్గాల కథలను తెరపై బలంగా చూపించే పా. రంజిత్ బ్యానర్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో దీనిపై ఇండస్ట్రీలో ఇప్పటికే ఆసక్తి నెలకొన్నట్లు తెలుస్తోంది. ఈ వెబ్ సిరీస్‌కు ప్రముఖ తమిళ దర్శకుడు సర్గణమ్ దర్శకత్వం వహించనున్నట్లు సమాచారం. ‘కలవాణి’, ‘నైయాండి’ వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన ఈ ప్రాజెక్ట్‌ను ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే కథకు సంబంధించిన స్క్రిప్ట్ పనులు పూర్తయ్యాయని, కథ నచ్చడంతో జాన్వీ వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు తెలుగులో జాన్వీ నటించిన ‘దేవర’ చిత్రం వాణిజ్యపరంగా విజయవంతమైనప్పటికీ, ఆమె పాత్ర నిడివి మరియు నటనపై సోషల్ మీడియాలో కొంత విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో తమిళంలో తెరకెక్కనున్న ఈ వెబ్ సిరీస్‌తో జాన్వీ ఎలాంటి గుర్తింపు సాధిస్తుందనేది ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.

నిఖిల్ ‘స్వయంభు’కు కొత్త డేట్ ఫిక్స్

యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక పీరియాడిక్ యాక్షన్ డ్రామా ‘స్వయంభు’ విడుదలకు సిద్ధమవుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. పలుమార్లు వాయిదా పడిన ఈ భారీ బడ్జెట్ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. అయితే సినిమా విడుదల తేదీ విషయంలో నెలకొన్న అనిశ్చితికి త్వరలోనే తెరపడే అవకాశం ఉన్నట్లు సమాచారం. అందుతున్న వివరాల ప్రకారం, ఈ ప్రెస్టీజియస్ చిత్రాన్ని సెప్టెంబర్ 3న విడుదల చేయాలని మేకర్స్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటనను చిత్ర యూనిట్ త్వరలోనే విడుదల చేసే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. నిఖిల్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో, విభిన్నమైన కథాంశంతో ఈ చారిత్రక నేపథ్య చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమాలో తన పాత్ర కోసం నిఖిల్ గుర్రపు స్వారీ, కత్తి సాము వంటి యుద్ధ విద్యల్లో ప్రత్యేక శిక్షణ కూడా తీసుకున్నాడు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సంయుక్తా మీనన్, నభా నటేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

రూమర్లపై కాంచన హీరో క్లారిటీ

మల్టీ టాలెంటెడ్ నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ రాజకీయ ప్రవేశంపై గత కొంతకాలంగా పలు చర్చలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇటీవల రాజకీయాల్లోకి రావాలా వద్దా అనే నిర్ణయాన్ని అభిమానుల అభిప్రాయానికి వదిలేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలో తమిళ నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ పోటీ చేసిన రెండు స్థానాల్లో ఒకటైన తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గం నుంచి రాఘవ లారెన్స్ పోటీ చేయబోతున్నారంటూ పలు వార్తలు, రూమర్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. అయితే ఈ ప్రచారంపై తాజాగా లారెన్స్ స్పందిస్తూ కీలక స్పష్టత ఇచ్చారు. విజయ్ పోటీ చేసిన స్థానంలో తాను పోటీ చేయబోవడం లేదని ఆయన స్పష్టం చేశారు. అలాగే తాను రాజకీయాల్లోకి రావడం లేదని కూడా ఎక్కడా చెప్పలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం తన పూర్తి దృష్టి సినిమాలపైనే ఉందని, ఇప్పటికే చేతిలో ఉన్న చిత్రాలను పూర్తి చేస్తానని తెలిపారు. అయితే సేవా కార్యక్రమాలు మాత్రం ఎప్పటికీ ఆగవని కాంచన హీరో, దర్శకుడు రాఘవ లారెన్స్ స్పష్టం చేశారు. దీంతో ఆయన రాజకీయ ఎంట్రీపై ఆశలు పెట్టుకున్న అభిమానులకు ఈ ప్రకటన కొంత నిరాశను మిగిల్చిందని చెప్పవచ్చు. ప్రస్తుతం రాఘవ లారెన్స్ ‘బెంజ్’, ‘కాంచన 4’ తదితర చిత్రాలతో బిజీగా ఉన్నారు.

‘రంభ, ఊర్వశీ, మేనక’తో అల్లరి నరేష్ రీఎంట్రీ!

కామెడీ చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అల్లరి నరేష్ మరోసారి తన అసలైన కామెడీ ట్రాక్‌లోకి అడుగుపెడుతున్నారు. వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వచ్చిన ఆయన, ఈసారి ఫాంటసీ కామెడీ జానర్‌లో నవ్వుల విందు అందించేందుకు సిద్ధమయ్యారు. అల్లరి నరేష్ నటిస్తున్న 65వ చిత్రానికి ‘రంభ ఊర్వశి మేనక’ అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. నరేష్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రానికి చంద్రమోహన్ చింతాడ దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థలు అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ‘కామెడీ గోస్ కాస్మిక్’ అనే ట్యాగ్‌లైన్‌తో రూపొందుతున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను వినూత్నంగా డిజైన్ చేశారు. పోస్టర్‌లో అల్లరి నరేష్ స్టైలిష్ లుక్‌లో స్వర్గపు మెట్లపై కూర్చుని కనిపించగా, చేతిలో రంభ, ఊర్వశి, మేనక పేర్లు రాసి ఉన్న పత్రాన్ని పట్టుకుని ఉన్నారు. మేఘాల మధ్య అప్సరసలు ఆయన చుట్టూ తిరుగుతున్నట్లుగా చూపించిన తీరు ఆకట్టుకుంటోంది. దైవిక అంశాలు, ఫాంటసీ టచ్‌తో కూడిన ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. నరేష్ మార్క్ కామెడీతో పాటు ఫాంటసీ అంశాలు కూడా ఉండటంతో ప్రేక్షకుల్లో అంచనాలు పెరిగాయి. ఈ చిత్రంలో అల్లరి నరేష్‌తో పాటు వెన్నెల కిషోర్, సీనియర్ నరేష్, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ తదితర ప్రముఖ హాస్యనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. టెక్నికల్ టీమ్ విషయానికి వస్తే చైతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తుండగా, రామ్ రెడ్డి సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతుండగా, సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

Published and Editor Owned by Adula Thirupathi, and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277